


# సూర్య

తెలుగు దినపత్రిక

www.suryaa.com

మహబూబ్‌నగర్
నాగర్‌కర్నూల్
జోగులాంబగద్వాల్
నారాయణపేట
వనపర్తి

సోమవారం 2 ఫిబ్రవరి 2026 పేజీలు 8


## ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడును

**- జిల్లాలో నెలరోజులపాటు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుంది**

**- జిల్లా ఎస్పీ డి జానకి**



**మిడ్జిల్ సూర్య న్యూస్ :** మున్సిపల్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా నెలరోజులపాటు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని దీనిని ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోబడునని జిల్లా ఎస్పీ డి జానకి తెలిపారు. జిల్లాలో జరగబోయే మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా మహబూబ్నగర్ జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి 1 ఉదయం 6 గంటల నుండి 28వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు నెల రోజులపాటు 30, 30 (ఎ) పోలీస్ యాక్ట్-1861 అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డి జానకి ఐపిఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసుల అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్లు, సభలు సమావేశాలు నిర్వహించరాదని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా శాంతి భద్రతలకు ఆటంకం కలిగించే విధంగా ఎలాంటి చట్ట విరుద్ధ కార్యక్రమాలు చేపట్టిన వారిపైన చట్టరీత్యా కఠినమైన చర్యలు తీసుకోబడునని తెలిపారు. కావున ఇట్టి విషయాన్ని గమనించి ప్రతి ఒక్కరూ సహకరించవలసిందిగా కోరారు.

## మద్దిలేటి స్వామి ఆలయ అభివృద్ధికి కృషి: డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్



**ఐజ సూర్య న్యూస్ :** అయిజ పట్టణంలోని 12వ వార్డులో కొలువై ఉన్న మద్దిలేటి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ వార్షికోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. భక్తుల ఆహ్వానం మేరకు ఈ వేడుకలకు అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్ హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం సంపత్ కుమార్ మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం తన సొంత నిధులతో ఆలయ ప్రాంగణంలో ఒక భారీ హైమాస్ట్ లైట్‌ను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. మద్దిలేటి స్వామి ఆలయంతో పాటు అయిజ పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ఆధ్యాత్మిక కేంద్రాలు అభివృద్ధి చెందినప్పుడే సమాజంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరుస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప, కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి, మాజీ సింగిల్ విండో చైర్మన్ సంకపురం రాముడు, రైతు సంఘం అధ్యక్షులు మేకల నాగిరెడ్డి, అయిజ మండల అధ్యక్షుడు జయన్న, సీనియర్ నాయకులు ప్రకాష్ గౌడ్, ప్రహ్లాద రెడ్డి, ఆర్. శ్రీధర్, వివిధ గ్రామాల సర్పంచులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజకీయ వేధింపుల కోసమే కెసిఆర్‌పై సిట్ నోటీసులు

**- నిరసన ధర్నాలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్**





**మహబూబ్‌నగర్ బ్యూరో, సూర్య న్యూస్ :** ఫోన్ టాంపరింగ్ కేసు విచారణలో సిట్ అధికారులు చట్టవిరుద్ధం, రాజ్యాంగ వ్యతిరేకంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కు నోటీసులు పంపడాన్ని నిరసిస్తూ మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా మీదుగా అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ తెచ్చిన నాయకుడు కెసిఆర్‌ని ఇబ్బంది పెట్టాలని ప్రభుత్వం చూస్తుంది. హై కోర్ట్ నిబంధనల ప్రకారం ఎక్కడ ఉంటె అక్కడ విచారణ చేయాలి..పోలీసులు నిబంధన పక్కకు పెట్టి గోడకు నోటీసులు అంటించారు అని మండిపడ్డారు. అన్ని వర్గాల సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించిన కెసిఆర్‌ను వేధింపులకు గురిచేయడం సరి కాదు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంకు కెసిఆర్‌కు సంబంధం లేదు. పోలీస్ అధికారులు వాళ్ళ నిబంధనల ప్రకారం ఏమైనా చేస్తే చేయవచ్చు. ఇప్పుడు మాతో పాటు మా నాయకుల ఫోన్‌లు ట్యాప్ చేస్తున్నారు. పోలీస్ అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా పనిచేయవద్దు. నిస్పక్షపాతంగా విధులు నిర్వహించాలి. పోలీస్ అధికారుల సంక్షేమం కోసం మా ప్రభుత్వం పని చేసింది. రెండేండ్ల తరువాత మళ్ళి వస్తాం. మీ తప్పుడు కేసులకు బెదిరింపులకు వెనక్కి తగ్గం అని హెచ్చరించారు. పార్టీ నాయకులు..కార్యకర్తలకు అండగా ఉంటాం..ఎవరు బెదిరింపులకు భయపడవద్దు. కెసిఆర్ ని ముట్టుకుంటే తెలంగాణ అగ్నిగుండం అయితది. కేసులు..జైళ్లకు భయపడవద్దు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసులు..జైళ్లకు భయపడలేదు కొట్లాడి..పోరాటం చేసి తెలంగాణ సాదించినం. కాంగ్రెస్, బీజేపీ కలిసి పుర ఎన్నికల బరిలో దిగుతున్నాయి. గతంలో కూడా అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే తరహా పనిచేసారు. సీఎం మీటింగ్ లో కూడా మేము ఇద్దరం ఒక్కటే కలిసి పని చేస్తామని చెప్పారు. రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో మహబూబ్ నగర్ వెనక్కి పోయింది..మేయర్ బీ ఆర్ ఎస్ కు ఇస్తే మహబూబ్ నగర్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళతాం అని హామీ ఇచ్చారు. మహబూబ్ నగర్‌లో దొడ్డి దారిలో కౌన్సిలర్ లను తీసుకొని చైర్మన్ తీసుకొని మహబూబ్ నగర్ అభివృద్ధి చేయలేదు. భారత రాష్ట్ర సమితికి మేయర్ ఇస్తే ప్రభుత్వంతో కొట్లాడి నిధులు తీసుకువచ్చి మహబూబ్ నగర్ అభివృద్ధి చేస్తాం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులు పూర్తి చేయడం లేదు.. మార్కెట్ కోసం కట్టిన భవనంలో గ్రంధాలయం పెడతామని అనడం సరి కాదు. పేదలకు సూపర్ స్పెషలిటీ వైద్య సేవలు అందించాలని 1000 పడకల ఆస్పత్రి నిర్మాణం చేస్తే పరికరాలు తెచ్చి ప్రారంభించడం లేదు. అండర్ గ్రౌడ్ పనులకు మేము నిధులు తెస్తే జీ ఓ నెంబర్ మార్చి కాంగ్రెస్ వాళ్ళు తెచ్చుకున్నట్లు చెప్పుకుంటున్నారు. కార్యక్రమంలో పుర ఎన్నికల పరిశీలకులు అలీ మస్కతి, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్, గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ వెంకటయ్య, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ ఆంజనేయులు, రెహమాన్, సీనియర్ నాయకులూ గణేష్, శ్రీనివాస్ రెడ్డి, నవకాంత్, మోసిన్ ఖాన్, హన్వాడ అన్వర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సామాన్యుని బడ్జెట్ సుస్థిర బడ్జెట్

**- కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్**



**నారాయణ పేట జిల్లా ప్రతినిధి సూర్య న్యూస్ :** 53 లక్షల 47 వేల 3 కోట్లు బడ్జెట్ తో భారతదేశాన్ని ప్రపంచంలో మూడవ ఆర్థిక శక్తిగా ఎదగడానికి ఊతమిచ్చిన 9వ కేంద్ర బడ్జెట్ లో ప్రతిపాదించిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ఆదివారం ప్రతిపాదించిన బడ్జెట్ వల్ల మధ్యతరగతి మహా జనానికి మరింతగా అవకాశాలు అన్ని విధాల పెరగబోతున్నాయనీ కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువిర్ యాదవ్ పేర్కొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వాహనాలు సెల్ ఫోన్లు ఎలక్ట్రానిక్ పరికరాల ధరలు తగ్గబోతున్నాయి. ఆదాయం పన్ను కట్టేవారికి మరిన్ని బాధలు 2026 ఏప్రిల్ ఒకటి నుండి అమలులోకి రాబోతున్న కొత్త ఆదాయపు పన్ను చట్టం **IT ACT** -26 ద్వారా తగ్గబోతున్నావన్నారు ఒక వారం కింద జరిగిన "భారత్-EU ఒప్పందం""" వల్ల అనేక అవకాశాలు ఈ బడ్జెట్లో కనబడబోతు న్నాయి. మొత్తం మీద ఇది భారతీయులకు బాధలు వారము వేయకుండా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ గారు తన తొమ్మిదవ బడ్జెట్ ప్రతిపాదించడం చాలా సంతోషకరమైన విషయమన్నారు ఇటు రైల్వే లైన్ లో హై స్పీడ్ రైలు హైదరాబాద్ టు బొంబే హైదరాబాద్ టు చెన్నై వారణాసి టు బొంబాయి బొంబాయి టు హైదరాబాద్ ముంబై టు సిలిగురి మధ్య మూడు హైస్పీడ్ రైలను ప్రవేశపెట్టడం సంతోషకరం. మొత్తం మీద ఈ బడ్జెట్ వికసిత భారత్ లక్ష్యానికి అనుగుణంగా దోహదపడబోతోందన్నారు.

## కేసీఆర్ ను ముట్టుకుంటే గులాబీ దండు ఊరుకోరు..





**కోస్గి సూర్య న్యూస్:** మాజీముఖ్యమంత్రి కేసీఆర్ ను ముట్టుకుంటే గులాబీ దండు దెబ్బ చూపిస్తామని మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి లు అన్నారు. ఆదివారం కోస్గిలో బైక్ ర్యాలీలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేసారు. నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీతో గులాబీమయమైన కోస్గిలో వారు మాట్లాడారు. కొడంగల్ లో కాంగ్రెస్ సర్కార్ పై తీవ్ర వ్యతిరేకత మూటా కట్టుకున్న రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం చెందారని అన్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై కాంగ్రెస్ సర్కార్ రాజకీయ వేధింపులకు గురిచేయడం సరికాదని నిరసిస్తూ రేవంత్ సర్కారుకు వ్యతిరేకంగా కోస్గి మున్సిపల్ కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించినట్లు పట్నం నరేందర్ రెడ్డి తెలిపారు. కేసీఆర్ ను ముట్టుకుంటే రాష్ట్రం అగ్నిగుండంలా మారుతుందని హెచ్చరించారు. పాలన చేతగాక, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక, ప్రజల దృష్టి మళ్లించడానికి కేసీఆర్ పై రాజకీయ వేధింపులకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వన్ని సహించేది లేదని అన్నారు. కేసీఆర్ గారి జోలికి వస్తే రేవంత్ రెడ్డిని, ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కొడంగల్ బొందపెట్టడానికి సిద్ధంగా ఉన్నది అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు శ్యాసం రామకృష్ణ, వెంకట్ నర్సిములు, మున్సిపల్ నాయకులు, కార్యకర్తలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమం రద్దు. -జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్



**నారాయణ పేట టౌన్ సూర్య న్యూస్ :** నారాయణపేట కలెక్టరేట్ లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుండి వినతులను స్వీకరించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారుప్రజావాణి కార్యక్రమం రద్దయిన విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని సూచించారు. ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు ప్రజావాణి కార్యక్రమము ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధిగా కొనసాగిస్తామని కలెక్టర్ వెల్లడించారు.

## అయిజలో బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్ట్



**ఐజ సూర్య న్యూస్ :** అయిజ మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల ప్రచారంలో ఉన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులను ఆదివారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కుర్వ పల్లయ్య ఉన్నారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్కు కాంగ్రెస్ ప్రభుత్వం సిట్ (ఎస్ ఐ టి) నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో అయిజ పట్టణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం మరియు నిరసన కార్యక్రమాలు నిర్వహించేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధమవుతున్నట్లు పోలీసులకు ముందస్తు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు ప్రచారంలో ఉన్న నేతలను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్కు తరలించారు. పోలీసుల చర్యను బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ప్రచారంలో ఉన్న తమను అక్రమంగా అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని, అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని వారు హెచ్చరించారు. కేసీఆర్పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## మండల కేంద్రంలో బిఆర్ఎస్ నిరసన



**వంగూరు, సూర్య న్యూస్ :** మండల కేంద్రంలో ఆదివారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు ఫోన్ టాపింగ్ కేసులో సిట్ అధికారులు విచారణ చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు నోటికి నల్ల గుడ్డలు కట్టుకొని వీధుల్లో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బ్యాంకు చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. దీనితో పాటు జ్యోతిరావు పూలే అంబేద్కర్ గాంధీజీ విగ్రహాలకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గిరిజనుల భాష సంస్కృతి కాపాడితేనే మన అస్తిత్వం నిలుస్తుంది.

### గిరిజన ఆదివాసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగయ్య నాయక్.





**కొల్లాపూర్. సూర్య న్యూస్:** గిరిజన జాతుల భాష, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడమే గిరిజనుల భవిష్యత్తుకు పునాది అని లింగయ్య నాయక్ అన్నారు. కొల్లాపూర్ తాలూకాలోని అన్ని మండలాల్లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచులు, ఉప సర్పంచులకు నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కొల్లాపూర్ మండల నదీ పరీవాహక ప్రాంతమైన సోమశీలలో సేవాలాల్ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. యంగంపల్లి తండా సర్పంచ్ యన్. గోపి నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు జిల్లా ఎరుకల సంఘం నాయకుడు శ్రీనివాసులు, కొల్లాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మహేష్, కొల్లాపూర్ మాజీ జెడ్పిటిసి హన్మంతు నాయక్, ఎస్సై లింగ్యా నాయక్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లింగయ్య నాయక్ మాట్లాడుతూ మన తండాల్లో మన రాజ్యం రావాలనే నినాదంతో ఎన్నో తరాలు పోరాడాయి. వారి త్యాగాల ఫలితంగానే ఈ రోజు తండాలు గ్రామ పంచాయతీలుగా మారాయి. కొల్లాపూర్ తాలూకాలో 22 మంది సర్పంచులు, 16 మంది ఉప సర్పంచులు గెలుపొందడం గిరిజనుల ఐక్యతకు, చైతన్యానికి నిదర్శనం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి సర్పంచ్ తన తండాను అభివృద్ధి బాట పట్టించాలి అని పిలుపునిచ్చారు. మాజీ జెడ్పిటిసి హనుమంతు నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో, ఆయన నాయకత్వంలో గిరిజన తండా గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. భాష, సంస్కృతి, సంప్రదాయాలను వదిలిపెడితే గిరిజనుల గుర్తింపే ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. అనంతరం విజయం సాధించిన సర్పంచులు, ఉప సర్పంచులను మెమోంటోలు, శాలువాలతో ఘనంగా సన్మానించి, సర్పంచుల 2026 నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభలో గిరిజన సంస్కృతి పరిమళిస్తూ ఉత్సవ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో చంద్రబండ తండా, మారేడుమాన్ దిన్నె, ముక్కిడిగుండం, లచ్చా నాయక్ తండా, బోడబండ తండా, నార్యా నాయక్ తండా, రాగూర్ తండా, ఎర్రన్నబావి తండా, నాగులపల్లి తండా, రేకులపల్లి తండా, గుండ్యావాల్యా నాయక్ తండా, తెల్లరాళ్లపల్లి తండా, శాగపూర్ తండా, కిష్టాపూర్ తండా, దావుత్ ఖాన్ పల్లి తండా, కదిరేపహాడ్, వల్లభాపూర్, నాగర్లబండ తండా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేళావత్ చిట్టి, కేతావత్ శంకర్ నాయక్, పాత్లావత్ లాలి, బాలు నాయక్, లాలిచంద్రు నాయక్, కోడావత్ బామినిబాలు నాయక్, మూడావత్ రాముడు నాయక్, మూడావత్ శివ నాయక్, కేతావత్ చంద్రకళ, రాజు నాయక్, బొజ్జమ్మ, పరమేష్ నాయక్, రాత్లావత్ రాములు నాయక్, కేతావత్ ప్రభాకర్ నాయక్, కేతావత్ ఉషా, నేనావత్ నాగేష్ నాయక్, కిషోర్ నాయక్, స్వప్న, తిరుపతి నాయక్, గోపి నాయక్తో పాటు గిరిజన ఉద్యోగులు, వనపర్తి జిల్లా గిరిజన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## హక్కుల పరిరక్షణ హ్యూమన్ రైట్స్ లక్ష్యం



**కోడేరు సూర్య న్యూస్:** ఈ మధ్యకాలంలో ప్రజల నుంచి హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కు అందుతున్న అనేక ఫిర్యాదుల ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేద ప్రజలకు కల్పించాల్సిన వైద్య సేవలో తీవ్ర లోపాలు వెల్లువెత్తుతున్నాయని హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బి శంకర్ ప్రసాద్ అన్నారు. ప్రత్యేకంగా ప్రభుత్వ ఆసుపత్రులు పేద ప్రజలకు ఉచిత చికిత్సలు, సర్జరీలు ఆలస్యం కావడం లేదా నిరాకరణ, మందులు, పరీక్షలు బయటకు పంపడం వంటి వాటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆరోగ్య హక్కు ఉన్నప్పటికీ సరైన సమాచారం ఇవ్వకపోవడంతో పేద ప్రజలు ఆరోగ్య హక్కును గౌరవంతో జీవించే హక్కును ఇట్టి ప్రభుత్వ ఆస్పత్రులు ఉల్లంఘిస్తున్నాయని అన్నారు. ఉల్లంఘన జరిగిన చోట ప్రజలకు అండగా హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉంటుందని ఆయన తెలిపారు. హ్యూమన్ రైట్స్ ప్రకారం ఉల్లంఘనకు గురైన వారు 9052585805 నంబర్ ను సంప్రదించాలని ఆయన కోరారు.

## సబ్సిడీపై వ్యవసాయ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోండి .

**పదర. సూర్య న్యూస్ :** సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు మంజూరు చేసిందని ఆసక్తిగల రైతులు దరఖాస్తు చేసుకోవాలని అమ్రాబాద్ వ్యవసాయ అధికారి మహేష్ రెడ్డి ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. చార్జింగ్ పంపు. గన్ పంపు. రోటవేటర్. సీడ్ .ఫర్టిలైజర్ డ్రిల్. గడ్డి చుట్టూ యంత్రం. కలుపు తీసే యంత్రం. గడ్డి కోసే యంత్రం. కల్టివేటర్ సబ్సిడీపై తదితర వ్యవసాయ పరికరాలు ఉన్నాయని ఆసక్తిగల రైతులు సోమవారం నాడు తమ తమ గ్రామాలకు సంబంధించిన వ్యవసాయ విస్తరణ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. అమ్రాబాద్ మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని వ్యవసాయ అధికారి మహేష్ రెడ్డి కోరారు.

## మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై ప్రభుత్వం సిట్ విచారణ చేపట్టడం తగదు



**లింగాల, సూర్య న్యూస్:** తెలంగాణ రాష్ట్రంను సాధించిన మహనీయుడు తొలి ముఖ్యమంత్రి బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ పేరుతో మాజీ ముఖ్యమంత్రిని ఉద్దేశపూర్వకంగా వేధిస్తున్నారని లింగాల మాజీ సర్పంచ్ కోనేటి తిరుపతయ్య ఆరోపించారు. భారత రాష్ట్ర సమితి రాష్ట్రవ్యాప్త నిరసనలలో భాగంగా ఆదివారం లింగాలలో మాజీ సీఎం కెసిఆర్ పై ప్రభుత్వ తీరును నిరసిస్తూ లింగాలలో నిరసన ర్యాలీ నిర్వహించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాయకుడిపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేయాలని చూడటం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని అన్నారు. కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతున్న అధికార పార్టీకి ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్తారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో లింగాల మాజీ సర్పంచ్ కోనేటి తిరుపతయ్య,ఉపసర్పంచ్ నాయక వీరస్వామి, ధారారం సర్పంచ్ శ్రీనివాసులు, వార్డ్ మెంబర్లు ప్రణయ్, జీవన్, రాసముల రమేష్,నాగరాజు, బళ్లారి జనార్ధన్, సమీర్, నారాయణస్వామి, ప్రశాంత్, వినయ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఐదవ వాడు అభివృద్ధి నా ప్రధాన లక్ష్యం:



**కొత్తకోట సూర్య న్యూస్:** కొత్తకోట మున్సిపల్ కేంద్రంలోని 05వ వార్డులో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవ చేయాలనే సంకల్పంతో ఆశా వర్కర్ ఉద్యోగాన్ని స్వచ్ఛందంగా వదులుకొని జనానికి సేవ చేయాలని పట్టుదలతో ఉన్నానని ముంత మంజుల రామకృష్ణ ఎన్నికల బరిలోకి దిగారు. వార్డు అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వస్తున్న ఆమెకు 05వ వార్డు ప్రజలు సంపూర్ణ మద్దతు తెలుపుతూ ఆశీర్వాదాలు అందజేస్తున్నారు. ఆమె సేవాభావాన్ని గుర్తించిన వార్డు సభ్యులు, స్థానికులు ఆమెకు వెన్నుదన్నుగా నిలుస్తూ విజయాన్ని కోరుకుంటున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై నిరసన చేసిన



**రేవల్లి సూర్య న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కెసిఆర్ )కి సిట్ నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచి ఇబ్బందులకు గురిచేయాడనికి నిరసన గా ఆదివారం బిఆర్ఎస్ పార్టీ నాయకుడు శివరాం రెడ్డి ఆధ్వర్యంలో రేవల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్బంగా బిఆర్ఎస్ మండల పార్టీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రము లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్నా ఆరాచక పాలనను ఎద్దేవా చేశారు. గతంలో కెసిఆర్ చేసిన పనులను పెండింగ్లో పెట్టి, కమిషన్ వచ్చే పనుల పై ద్రుష్టి ఉంది. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకుడు శివరాం రెడ్డి, ఖజా, భాస్కర్ రెడ్డి,, ఉపసర్పంచ్ సుధాకర్ రెడ్డి, అబ్బాస్,వార్డ్ మెంబర్లు బాలస్వామి,రాము మాసయ్య, సీనియర్ నాయకుడు బీరం కృష్ణ రెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**కోడేరు, సూర్య న్యూస్:** మండల పరిధిలోని జనుంపల్లి గ్రామానికి చెందిన గొల్ల పరుశురాముడు భార్య జనవరి 25వ తారీఖున అనారోగ్య సమస్యలతో మృతి చెందింది. దీంతో విషయం తెలుసుకున్న మిలీనియం(2000-2001) పదవ తరగతి బ్యాచ్ కు చెందిన పరశురాముడు మిత్రులు అందరూ కలిసి సుమారు 73,500 ఆర్థిక సహాయం అందజేశారు ఈ కార్యక్రమంలో వారి యొక్క గురుతుల్యులు నాగేశ్వర్ రెడ్డి ,దేవేందర్ లు కూడా వారి కుటుంబాన్ని సందర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

## బాల్య మిత్రునికి ఆర్థిక సహాయం



**గోపాలపేట సూర్య :** గోపాలపేట మండల కేంద్రంలోని పెద్ద వడ్డెగేరి గేరి కాలనీకి చెందిన ఈశ్వర్ ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబానికి పదవ తరగతి 2000-2001 బ్యాచ్ కు చెందిన బాల్యమిత్రులు 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం కింద అందజేశారు ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ కాశీనాథ్ పానుగంటి శేఖర్ నరేష్ శంకర్ పూల శేఖర్ జితేందర్ ఎం కృష్ణయ్య బావన్న చిన్న రాములు మద్దిలేటి ఉన్నారు సహకరించిన మిత్రులందరికీ కుటుంబ కృతజ్ఞతలు తెలిపారు.

## మానవత్వం చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్



**కోడేరు, సూర్యన్యూస్:** మండల పరిధిలోని రాజాపూర్ గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ అనే వృద్ధురాలు కొల్లాపూర్ నుంచి ఆర్టీసీ బస్సులో రాజాపూర్ గ్రామానికి వస్తుండగా తన కవర్లో దాచుకున్న 35 వేల రూపాయలను మరియు సెల్ ఫోను ను బస్సులోనే ఉంచి మరిచిపోయి రాజాపూర్ లో దిగింది. బస్సు దిగిన తర్వాత కవర్లో డబ్బులు, ఫోను మరిచిపోయిన సంగతిని రాజాపూర్ గ్రామానికి చెందిన అనిత కు తెలపడంతో ఆమె వెంటనే డ్రైవర్ మరియు కండక్టర్ దృష్టికి ఫోన్ ద్వారా తెలిపింది. దీంతో గోపాల్పేట్ దగ్గర బస్సు ఆపి తనిఖీ చేయగా బస్సు సీట్ కింద ఉన్నట్లుగా గుర్తించి బాధితురాలికి డబ్బులను, ఫోను ను అందజేశారు. దీంతో రాజాపూర్ సర్పంచ్ ముద్దుల గండ్ల ప్రభాకర్ మానవత్వం చాటుకున్న డ్రైవర్ చిన్నస్వామి, కండక్టర్ పగడాల రాముడు లకు సన్మానం చేశారు. గ్రామ అధ్యక్షులు ఎం బాలక రాముడు, నాగిరెడ్డి మరియు ఓమాచారి తదితరులు ఉన్నారు.

## శివ స్వాముల ఖర్చులకు ఆర్థిక సహాయం



**కోడేరు, సూర్యన్యూస్:** మండల కేంద్రంలో శివ స్వాములు నిర్వహించే అగ్నిగుండం సందర్భంగా కోడేరు సర్పంచ్ నడింపల్లి మహేశ్వర్ రెడ్డి వారి ఆర్థిక ఖర్చుల నిమిత్తం 10 వేల రూపాయలు శివ స్వాములకు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాసయ్య, వార్డు మెంబర్లు ఆదిశరత్, మిద్దె రామకృష్ణ, సోప్పరి సత్యనారాయణ, సోప్పరి మహేష్, వాల్మీకి సంఘం అధ్యక్షుడు మద్దిలేటి, చంద్రశేఖర్ రెడ్డి, బాలరాజు యాదవ్, అశోక్, బాబు (గుండి), ఇమ్రాన్, సురేష్, పాల్గొని వారి చేతుల మీదుగా గురుస్వామికి అందజేశారు.

## శివాలయంలో శివదీక్ష స్వాములకు అన్నప్రసాద పంపిణీ



**నాగర్ కర్నూల్ ఎడ్యుకేషన్ సూర్య న్యూస్ :** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ దగ్గర గల ఆకారపు శివాలయంలో ఆదివారం శివదీక్ష స్వాములకు మడితో కూడిన అన్న ప్రసాద పంపిణీ చేశారు. ఆకారపు వంశీయులు మరియు వారి కుటుంబ సభ్యులు మహాశివరాత్రి పర్వదినం వరకు ప్రతిరోజు శివ దీక్ష స్వాములకు మధ్యాహ్నం శివదీక్ష గురు స్వామి వండిన మడితో కూడిన అన్న ప్రసాదాన్ని పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకారపు శంకరయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు బి. వేణు గోపాల్, రామస్వామి, బద్రీనాథ్, శ్రీనాథ్, ఓంకార్, సత్యనారాయణ, రవికుమార్, శరత్, నరసింహ స్వామి, గౌడ్, శివ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## డైవర్షన్ పాలిటిక్స్‌కు నిరసనగా సీఎం దిష్టిబొమ్మ దహనం.

### - కేసీఆర్‌పై సిట్ నోటీసులు తక్షణమే వెనక్కి తీసుకోవాలి.

### గంట్రావుపల్లి బీఆర్ఎస్ ఆగ్రహం



**పెద్దకొత్తపల్లి. సూర్య న్యూస్:** డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్పై సిట్ నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, గంట్రావుపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోయి, ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేసీఆర్‌పై అకారణ కేసులు, సిట్ నోటీసులతో రాజకీయ వేధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన నాయకుడిపై కక్షపూరిత రాజకీయాలు చేయడం తగదని మండిపడ్డారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన ప్రభుత్వం, ప్రతిపక్షాన్ని అణిచివేయడమే లక్ష్యంగా పనిచేస్తోందని విమర్శించారు. కేసీఆర్‌పై వేధింపులు కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## సిట్ విచారణ పేరుతో కేసీఆర్‌పై వేధింపులు అప్రజాస్వామికం.



**వెల్దండ సూర్య న్యూస్ :** సీట్ విచారణ పేరుతో కెసిఆర్ పై వేధింపులు అప్రజాస్వామి కం. అని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిట్ విచారణ పేరిట బీఆర్ఎస్ అధినేత. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నీ వేధించడం అత్యంత దుర్మార్గమైన చర్యగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాయకుడిపై రాజకీయ కక్షతో చర్యలకు పాల్పడటం రేవంత్ రెడ్డి ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. కేసీఆర్ సిట్ విచారణకు హాజరుకానున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. తెలంగాణ అంతటా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మలను తగలబెట్టడంతో పాటు. నియోజకవర్గ స్థాయిలో భారీ ఎత్తున బైక్ ర్యాలీలు నిర్వహిస్తూ ప్రభుత్వ దమనకాండకు వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. కేసీఆర్‌కు మద్దతుగా. రేవంత్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో రాష్ట్రం మార్మోగింది. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో గోలి శ్రీనివాస్ రెడ్డి. రేవంత్ ప్రభుత్వంపైమండిపడ్డారు .తెలంగాణ కోసం తన జీవితాన్నే అర్పించిన నాయకుడు కేసీఆర్. అలాంటి వ్యక్తిపై సిట్ విచారణ పేరుతో వేధింపులకు దిగడం అంటే తెలంగాణ ప్రజల మనోభావాలను అవమానించడమే. అని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సమస్యలు పక్కనపెట్టి ప్రతిపక్షాలను అణిచివేయడమే లక్ష్యంగా రేవంత్ ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే నియంతృత్వ పోకడలు ప్రదర్శిస్తూ. ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తోందని ఆరోపించారు. రాజకీయ లబ్ధి కోసం కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకోవడం చరిత్రలో చెడ్డ ఉదాహరణగా మిగిలిపోతుందని హెచ్చరించారు. కేసీఆర్‌పై ఎలాంటి అక్రమ, అన్యాయ చర్యలకు పాల్పడినా బీ.ఆర్.ఎస్ పార్టీతో పాటు తెలంగాణ ప్రజలు చూస్తూ ఊరుకోరని. ఇది కేసీఆర్ వ్యక్తిగత అంశం కాదని. తెలంగాణ ఆత్మగౌరవానికి సంబంధించిన పోరాటమని అన్నారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధమని ఆయన గట్టి హెచ్చరిక చేశారు. మొత్తంగా, సిట్ విచారణ పేరిట ప్రారంభమైన ఈ రాజకీయ కక్ష సాధింపు తెలంగాణ రాజకీయాలను ప్రమాదకర మలుపు తిప్పుతోందని. ప్రభుత్వం తమ వైఖరిని మార్చుకోవాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో. మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి. వైస్ ఎంపీపీ అనిల్ కుమార్. జిల్లా నాయకులు నాగులు నాయక్. మాజీ సర్పంచ్ అంజి నాయక్. వార్డు సభ్యులు సునీత ఆనంద్. మాజీ ఎంపీటీసీ హన్మంతు. మాజీ ఎంపీటీసీ లింగం. ఉప సర్పంచ్ అల్వల్ యాదవ్. అంజి మాస్టర్. అశోక్. రవి. రాజు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌కు సిట్ నోటీస్ జారీపై భగ్గుమన్న బీఆర్ఎస్ భారీ నిరసన



**కొత్తకోటసూర్య న్యూస్ :** కొత్తకోట మున్సిపాలిటీలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు షిట్ నోటీస్ జారీ చేయడాన్ని నిరసిస్తూ దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్‌పై రాజకీయ కక్షతోనే నోటీసులు జారీ చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు ప్రాణాలు పెట్టిన నాయకుడిని అవమానించే ప్రయత్నాలను బీఆర్ఎస్ సహించబోదన్నారు. ప్రజల కోసం పని చేసిన సీఎంపై అకారణంగా నోటీసులు ఇవ్వడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతుబీమా వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. అలాంటి నాయకుడిపై కక్షపూరిత చర్యలు తీసుకోవడం ప్రజల మనోభావాలను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే కేసీఆర్‌పై నోటీసుల పేరుతో రాజకీయ డ్రామా ఆడుతోందని విమర్శించారు. తక్షణమే షిట్ నోటీసును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన విభాగం నాయకులు, మహిళా విభాగం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు. కేసీఆర్‌కు మద్దతుగా నినాదాలు చేస్తూ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా తమ నిరసన వ్యక్తం చేశారు.

## కొత్తకోట బీసీ బాలికల హాస్టల్ ఘటనపై సమగ్ర విచారణకు డిమాండ్

### కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో బీసీ హాస్టల్ సంక్షేమ అధికారిణిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి – PDSU



**కొత్తకోట సూర్య న్యూస్:** పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందుకూరి పవన్ కుమార్ కొత్తకోట పట్టణంలోని బీసీ బాలికల హాస్టల్‌లో విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటన తీవ్ర ఆందోళన కలిగించేదిగా ఉందని ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్ (PDSU) జిల్లా కమిటీ ఖండించింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని PDSU రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందుకూరి పవన్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హాస్టల్‌లో భోజనం చేసిన అనంతరం 18 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురై వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించబడిన విషయం తెలిసిందేనని తెలిపారు. చికిత్స అనంతరం వారు డిశ్చార్జి అయినప్పటికీ, ఈ ఘటన ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేస్తోందని అన్నారు. ఈ ఘటనపై ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు ఆస్పత్రిని సందర్శించి విద్యార్థినులతో మాట్లాడినట్టు, హాస్టల్‌ను తనిఖీ చేసినట్టు పత్రికల్లో వచ్చిన వార్తలను సాణూఖ గుర్తు చేసింది. అన్నం, పప్పు, సాంబారు, కూరగాయలు, బియ్యం నమూనాలు, నిల్వ గదులు, పరిసరాల పరిశుభ్రతను అధికారులు పరిశీలించినట్టు తెలిపారు. కేవలం వార్డెన్, వర్కర్లను సస్పెండ్ చేయడం సరిపోదని సాణూఖ స్పష్టం చేసింది. ఇది కేవలం వంటగది లోపం మాత్రమే కాకుండా, వ్యవస్థాత్మక నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం, బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని పేర్కొంది. ఈ మొత్తం వ్యవహారంపై పర్యవేక్షణ బాధ్యత కలిగిన బీసీ బాలికల హాస్టల్ సంక్షేమ అధికారిణి శ్రీమతి విజయ బానవత్ గారిపై కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేసి సమగ్ర విచారణ జరపాలని సాణూఖ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందుకూరి పవన్ కుమార్ డిమాండ్ చేశారు. PDSU ప్రధాన డిమాండ్లు: కొత్తకోట బీసీ బాలికల హాస్టల్ ఘటనపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. విద్యార్థినుల అస్వస్థతకు గల అసలు కారణాలు, బాధ్యులను గుర్తించాలి. హాస్టల్ నిర్వహణ, ఆహార సరఫరా, నిధుల వినియోగంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన పర్యవేక్షణ అమలు చేయాలి. బీసీ బాలికల హాస్టళ్లు పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థినుల కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ సంక్షేమ పథకాలని, వాటిలో నిర్లక్ష్యం వల్ల ప్రాణాలకు ముప్పు ఏర్పడితే సహించబోమని PDSU స్పష్టం చేసింది. ఈ ఘటనపై పోలీసులు, జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్, రాజు సీతారాం, రాఘవేందర్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తిరుమలనాథస్వామి ఉత్సవాలు



**నవాబుపేట్ సూర్య న్యూస్ :** మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ తిరుమలనాథ స్వామి వారి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా స్వామివారికి దీప, దూప, నైవేద్య, పూజ కైంకర్యాలను శాస్త్రోక్తంగా పూజారులు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి రథోత్సవం(బండ్లు తిరుగుట)కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గీతారాణి, గ్రామ పెద్దలు మాడెమోని నరసింహులు, నరసింహ చారి, గోపాల్ గౌడ్, మెండే అంజయ్య, పుట్టి అంజయ్య, మాడెమోని రాజుస్వామి, పుట్టి శ్రీనివాస్, నరసింహులు యాదవ్, రమేష్, గండు తిరుపతయ్య, శివ స్వాములు, ఉత్సవ కమిటీ సభ్యులు రాజు, ఆంజనేయులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భక్తులకు అన్నదానం నిర్వహించిన ఫైవ్ స్టార్ మేనేజర్ నర్సింహ



**నారాయణ పేట జిల్లా ప్రతినిధి సూర్య న్యూస్** : ఎక్లాస్ పూర్ గ్రామంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం గుట్టపై నా భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో పేట జిల్లాలోని వివిధ గ్రామాల నుండి పెద్ద మొత్తం లో భక్తులు పాల్గొన్నారు

## యువత స్వయంకృషితో ఎదగాలి... సర్పంచ్ హరి సింగ్



**కోయిలకొండ సూర్య న్యూస్:** సమాజంలో ఉన్న యువత స్వయంతో ఎదిగినప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందని ఉబ్బడి తండా సర్పంచ్ హరి సింగ్ తెలియజేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఉన్న పిస్తా హౌస్ దగ్గర టీ సిటీ బ్రాంచ్ టీ స్టాల్ ప్రారంభించడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఉబ్బడి తాండ గ్రామానికి చెందిన బీ ఆర్ఎస్ కార్యకర్త రవీందర్ టీ స్టాల్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. అదేవిధంగా గిరిజన యువకులు అన్ని రంగాలలో ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో, లాలూ రాథోడ్, బాలు నాయక్, కృష్ణ, రాజు, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య మిత్రునికి ఆర్థిక సహాయం



**గోపాలపేట సూర్య** : గోపాలపేట మండల కేంద్రంలోని పెద్ద వడ్డేగేరి గేరి కాలనీకి చెందిన ఈశ్వర్ ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబానికి పదవ తరగతి 2000-2001 బ్యాచ్ కు చెందిన బాల్యమిత్రులు 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం కింద అందజేశారు ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ కాశీనాథ్ పానుగంటి శేఖర్ నరేష్ శంకర్ పూల శేఖర్ జితేందర్ ఎం కృష్ణయ్య బావన్న చిన్న రాములు మద్దిలేటి ఉన్నారు సహకరించిన మిత్రులందరికీ కుటుంబ కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రయణించే రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



**కృష్ణ సూర్య న్యూస్** : ప్రమాదవశాత్తు ప్రయణించే రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన నారాయణ పేట జిల్లా మక్తల్ నియోజకవర్గం కృష్ణ మండలంలోని కృష్ణ రైల్వే వంతెనపై ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. రైల్వే పోలీస్ అధికారి ముని స్వామి తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా కల్లూర్ గ్రామానికి చెందిన బస్వరాజ్ (70) రాయచూర్ రైల్వే స్టేషన్ నుంచి దైవ దర్శనానికి రైలులో ప్రయాణిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు వంతెన పై జారిపడటంతో తీవ్ర గాయాలై రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పేర్కొన్నారు. రైల్వే టికెట్ వివరాల ఆధారంగా మృతిడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించమన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబ్నగర్ ఆసుపత్రికి తరలించినట్లు, ఈ ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీస్ అధికారి ముని స్వామి తెలిపారు.

## బిఆర్ఎస్ శ్రేణుల నిరసన



ఇటిక్యాల సూర్య న్యూస్: జోగులాంబ గద్వాల జిల్లా లో బీఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇచ్చినందుకు ఎర్రవల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన తెలిపారు. ఈ కార్యక్రమం ఎమ్మెల్యే విజయుడు ఆధ్వర్యంలో ఎర్రవల్లి చౌరస్తాలో భారీ ర్యాలీతో నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నాగరాల గ్రామంలో అంబేద్కర్ సంఘ ఐక్యత పునరుద్ధరణ

### - "ఏప్రిల్ 14 విగ్రహావిష్కరణకు సమిష్టి నాంది..





**శ్రీరంగాపూర్, సూర్య న్యూస్** : శ్రీరంగాపురం మండలం నాగరాల గ్రామంలో 1996లో స్థాపితమైన అంబేద్కర్ సంఘం గతంలో అన్ని విధాల సక్రమంగా కొనసాగుతూ ఎన్నో సామాజిక, సమానత్వ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించింది. కాలక్రమంలో కొన్ని కారణాల వల్ల సభ్యులంతా సమావేశాలకు హాజరుకాకపోవడం, చిన్నచిన్న మనస్పర్థలు ఏర్పడటం జరిగింది. ఈ నేపథ్యంలో సంఘ నిర్వాహకులైన పెద్దల సమక్షంలో సభ్యులందరూ కూర్చొని చర్చలు జరిపి భేదాభిప్రాయాలను స్నేహపూర్వకంగా పరిష్కరించుకున్నారు. ఐక్యతే సంఘ బలమని స్పష్టం చేస్తూ మళ్లీ ఏకతాటిపై నడవాలని నిర్ణయించారు.రానున్న 2026 ఏప్రిల్ 14న నిర్వహించనున్న డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి గ్రామ ప్రజలందరూ నాంది పలకాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముందుగా విగ్రహావిష్కరణ కమిటీని ఏర్పాటు చేసేందుకు వచ్చే ఆదివారం సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి అంబేద్కర్ సంఘ సభ్యుడు బాధ్యతగా హాజరై సహకరించాలని నిర్వాహకులు కోరారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు, నిర్వాహకులు బత్తిని గణేష్, కేశపాగ చెన్నయ్య (అలియాస్ కల్వవల్లి చైతన్య), మాజీ అధ్యక్షులు కేశపాగ మద్దిలేటి, చారకొండ కురుమయ్య, బత్తిని మద్దిలేటి, ప్రధాన కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు, కోశాధికారులు పాల్గొన్నారు. అలాగే ఎస్. చిన్న నరసింహ, బి. కురుమయ్య, బి. రాజు, బొక్కలయ్య, పులిందర్, బి. స్వామి, ఎస్ భానుచందర్, ఎస్ మద్దిలేటి, చంద్రాయుడు, శ్రీకాంత్, రమేష్, బి. నరసింహ, కర్ణాకర్ తదితర సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని ఐక్యతకు మద్దతు తెలిపారు. సంఘం భవిష్యత్ కార్యక్రమాలు సమిష్టిగా ముందుకు తీసుకెళ్లాలని సభ్యులు తీర్మానించారు.

## అయిజ మున్సిపాలిటీ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం: కొలను శంకర్ రెడ్డి



**ఐజ సూర్య న్యూస్** : అయిజ మున్సిపాలిటీ అభివృద్ధి మరియు రక్షణ కేవలం భారతీయ జనతా పార్టీతోనే సాధ్యమని బీజేపీ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రభారి కొలను శంకర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని దుర్గా నగర్ కార్యాలయంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు కంపాటి భగత్ రెడ్డి అధ్యక్షతన వార్డు అభ్యర్థులు, ముఖ్య నాయకులతో కలిసి ఎన్నికల సన్నద్ధత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశవ్యాప్తంగా సాగుతున్న అభివృద్ధి ఫలాలను పట్టణంలోని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పేదల సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల కల్పన, మహిళా మరియు యువత అభ్యున్నతి కోసం చేపట్టిన చర్యలను ప్రజలకు వివరించాలని దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఖాతా తెరవడమే కాకుండా, చైర్మన్ పీఠాన్ని దక్కించుకునేలా భారీ మెజార్టీతో అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆయన కోరారు. కార్యకర్తలు ఓటర్లతో నేరుగా అనుసంధానమై, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షులు రామచంద్ర రెడ్డి, 2023 ఎమ్మెల్యే అభ్యర్థి బలిగేర శివారెడ్డి, ఐజ మండల అధ్యక్షులు గోపాలకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు సంఘాల సంజీవరెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాదన్న, కిసాన్ మోర్చా నాయకులు మేడికొండ భీమ్సేన్ రావు, మాన్ దొడ్డి ఉపసర్పంచ్ భీమన్న, వడ్ల వీరయ్య చారి మరియు వివిధ వార్డుల అభ్యర్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధం: రైతుకు రూ. 70 వేల నష్టం





**ఐజ సూర్య న్యూస్** : మండలంలోని ఈడిగోనిపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో రెండు భారీ గడ్డివాములు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. వివరాల్లోకి వెళ్తే గ్రామానికి చెందిన రైతు ఉగాది శేఖర్ తన పశువుల మేత కోసం నిల్వ చేసుకున్న రెండు గడ్డివాములకు ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. గాలి తోడు కావడంతో మంటలు క్షణాల్లోనే ఎగసిపడ్డాయి. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. రంగంలోకి దిగిన ఫైర్ ఇంజన్ సిబ్బంది, గ్రామస్తుల సహాయంతో తీవ్రంగా శ్రమించి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే గడ్డివాములు పూర్తిగా దగ్ధం కావడంతో సుమారు రూ. 70 వేల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. ఏడాది పొడవునా పశువుల మేత కోసం దాచుకున్న గడ్డి కాలిపోవడంతో ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు శేఖర్ కోరుతున్నాడు.

## బోరు వేసి నీటి సమస్య తీర్చిన

### బిజ్వారం సర్పంచ్ వై. శైలజ శ్రీనివాసరెడ్డి



**మల్దకల్ సూర్య న్యూస్:** నెలలు తరబడిగా స్కూల్ లో విద్యార్థులు ఎదుర్కొంటున్న త్రాగునీటి సమస్యను ప్రధానోపాధ్యాయులు మహేష్ సర్పంచ్ శైలజ శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. కానీ ఇచ్చిన మాట ప్రకారం తన సొంత నిధులతో తాగునీటి బోరు వేయించి పరిష్కరించారు. నీరు పుష్కలంగా పడడంతో గ్రామస్తులు ఇక నీటి సమస్య తీరిందంటూ...బిజ్వారం గ్రామ సర్పంచ్ శైలజ శ్రీనివాసరెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. వివరాల్లోకి వెళితే... జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పరిధిలోని బిజ్వారం గ్రామంలో ఆదివారం సర్పంచ్ వై.శైలజ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సొంత ఖర్చులతో బోరు వేయించి విద్యార్థుల కష్టాలను ఎదుర్కొంటున్న సమస్యను తీర్చారు. బోరులో నీరు పుష్కలంగా పడడంతో స్కూల్ లో తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో విద్యార్థులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిన్ను కృష్ణారెడ్డి, మీసాల రాజారెడ్డి, సోమేశ్వర్ రెడ్డి, రాగి మాన్ తిమ్మారెడ్డి, శుద్ధ వెంకటేశ్వర రెడ్డి, గుడికాటి ఆశన్న, కర్రే సత్యారెడ్డి,కొంకల గోకారన్న, సుభాన్, తెలుగు కృష్ణమూర్తి, తెలుగునరసింహులు, బ్రహ్మయ్య, ఆర్గనైజర్ కృష్ణ, నారాయణ, మల్లీ, వడ్డే గోపాల్, వెంకటేష్, రాముడు స్వామి, చాపల కండ్ల అంజి, కుక్కల రవి, పెద్దింటి రాజు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క అవకాశం ఇవ్వండి 19వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతా: మాస్టర్ షేక్షావలి ఆచారి



**ఐజ సూర్య న్యూస్** : ఐజ మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి, రాష్ట్ర అధికార ప్రతినిధి మాస్టర్ షేక్షావలి ఆచారి తన ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఆదివారం వార్డులోని మద్దిగుంట, పాత బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఆయన ఇంటింటికీ తిరుగుతూ 'హస్తం' గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకున్న వ్యక్తిగా వార్డు సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, తనకు ఒక్క అవకాశం ఇస్తే 19వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యంగా కాలనీల్లో అధ్వానంగా ఉన్న సీసీ రోడ్ల వ్యవస్థను, అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తానని ఓటర్లకు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున, వార్డు అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేయించి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తానని విజ్ఞప్తి చేశారు. విద్యావంతుడు, సౌమ్యుడైన షేక్షావలి ఆచారికి వార్డు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. మహిళలు ఆయనకు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు వార్డు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగాచింతల్ తాండాలో లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు





**కోయిలకొండ సూర్య న్యూస్ :** మండలంలోని చింతల్ తాండ లో లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కన్నుల పండుగ జరిగింది. అదేవిధంగా జల్ది మహోత్సవ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు ఘనంగా ఊరేగింపు తీసి, స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కల్యాణోత్సవం కన్నుల పండుగగా పూజారి రాఘవేంద్రరావు జరిపించడం జరిగింది. వచ్చిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని కిషన్ నాయక్ ఏర్పాటు చేశారు . ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్. రుక్మి బాయ్. ఉప సర్పంచ్ నర్సింగ్ నాయక్. మాజీ ఎంపిటిసి రామచందర్. గ్రామ పెద్దలు వెంకట్ నాయక్. కిషన్ నాయక్. శంకర్ నాయక్. రామ్ లాల్. రాములు. శంకర్ నాయక్. తదితరులు పాల్గొన్నారు.

## కరెట్టే శిక్షణ పొందిన విద్యార్థులకు పరీక్ష



**కోయిలకొండ సూర్య న్యూస్ :** మండలంలో వివిధ గ్రామాలలో కరేటి శిక్షణ పొందిన విద్యార్థులకు ఆదివారం జిల్లా కేంద్రంలో బెల్ట్ పరీక్షలు నిర్వహించడం జరిగిందని మండల న్యా మం క్ కుంగుపు మాస్టర్ రాఘవేందర్ గౌడ్ తెలిపారు. కరేటేలో వివిధ రకాల శిక్షణలు పొందిన వారికి గుర్తింపు బెల్టులు అందించడం జరుగుతుందని తెలిపారు. మండలంలో ఆసక్తి గలవారు కరెట్టే నేర్చుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చీఫ్ గే న్ మాస్టర్ కనకయ్య యాదవ్, శిక్షణ పొందుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.

## కే సీ ఆర్ పై సిట్ విచారణకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన బీఆర్ఎస్ శ్రేణులు



**అడ్డాకుల, సూర్య న్యూస్ :** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రాజకీయ వేదింపులకు నిరసనగా ఆదివారం అడ్డాకుల మండలంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుత నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా అడ్డాకుల మండల పరిధి లోని రాచాల, కందూరు, మండల కేంద్రంలో నాయకులు మాట్లాడుతూ కేసీఆర్ పై రాజకీయ వేధింపులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ప్రజల తీర్పు తో ఎన్నుకోబడిన నాయకుడిపై కక్ష సాధింపు చర్యలు కొనసాగితే తెలంగాణ ప్రజలు సహించబోరని హెచ్చరించారు. కేసీఆర్ ను ముట్టుకుంటే తెలంగాణ అగ్నిగుండం అవుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఇటువంటి రాజకీయ కక్ష సాధింపు చర్యలను విరమించుకోవాలని లేని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజలతో కలిసి మరింత తీవ్రస్థాయిలో పోరాడడానికి సిద్ధమవుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా కేసీఆర్ కు అనుకూలంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రంగన్న గౌడ్, ఖాజామైనొద్దిన్, శ్రీకాంత్, రమేష్ గౌడ్, చక్రపాణి రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

## 4వార్డు ఇంటింటి ప్రచారంలో దూసుకుపోతున్న కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి.శరవంద



**సూర్య, వనపర్తి ప్రతినిధి :**వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 4వార్డులో కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి.శరవంద ప్రచార హోరు ఉధృతంగా కొనసాగుతుంది. కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి.శరవంద, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి వార్డులో గడప గడపకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటిని సందర్శిస్తూ...కాలనీ ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.కాలనీలోని ఓటర్లను నేరుగా కలిసి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు.తనకు అవకాశం ఇస్తే ఎల్లవేళలా కాలనీ ప్రజలకు అందుబాటులో ఉంటూ పని చేస్తానని హామీ ఇచ్చారు.వారి వెంట కాంగ్రెస్ నాయకులు బొంబాయి కొండన్న, ఎల్లపు నరేందర్, నరసింహా, నరేందర్, విజయ్ తదితరులు ఉన్నారు.

# కేసీఆర్ కు నోటీసులంటే తెలంగాణ ను అవమానించడమే

**- సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం**





**చిన్నంబావి / సూర్య మేజర్ న్యూస్ :** చిన్నంబావి: కెసిఆర్ కు నోటీసులంటే తెలంగాణ రాష్ట్ర అవమానించడమే అని బిఆర్ఎస్ పార్టీ నాయకులు అన్నారు. ఆదివారం నాడు మండల కేంద్రంలో ఈరోజు మాజీముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌పై సిట్ విచారణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు మండల వ్యాప్తంగా తీవ్ర ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ విధమైన కుట్ర రాజకీయాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడుతోందని వారుతీవ్రంగావిమర్శించారు. ఈ నేపథ్యంలో చిన్నంబావి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేస్తూ ప్రభుత్వ తీరుపై ఘాటైన నినాదాలు చేశారు. “కేసీఆర్‌పై సిట్ విచారణను వెంటనేఉపసంహరించుకోవాలి”, రాజకీయ కక్షతో కేసులు పెట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం” ప్రజల మద్దతుతో బీఆర్ఎస్ మళ్లీఅధికారంలోకి వస్తుంది”అంటూనినాదాలతో మండల కేంద్రంమార్మోగింది. బిఆర్ఎస్ నాయకులుమాట్లాడుతూ తెలంగాణను అభివృద్ధి పథంలో నిలిపిన కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. సిట్ విచారణ అనేది పూర్తిగా రాజకీయ డ్రామా మాత్రమే. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ కుట్రలు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ఈ అన్యాయానికి తగిన సమాధానం ప్రజలే ఇస్తారు,” అనితీవ్రంగామండిపడ్డారు. చిన్నంబావి మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఈ నిరసనలో పాల్గొన్నారు. మహిళలు, యువకులు కూడా భారీగా హాజరై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గ్రామగ్రామానా బీఆర్ఎస్ బలం ఇంకా చెక్కుచెదరలేదని ఈ కార్యక్రమం స్పష్టంగా చూపించిందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమం శాంతియుతంగా కొనసాగినప్పటికీ, పోలీసులు ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేపట్టి పరిస్థితిని పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. చివరగా బీఆర్ఎస్ శ్రేణులు మాట్లాడుతూ కేసీఆర్‌పై జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా మా పోరాటం ఆగదు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం. అవసరమైతే మరిన్ని పెద్ద ఆందోళన కార్యక్రమాలు చేపడతాం, అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, మాజీ జెడ్పిటిసి వెంకట రమణమ్మ, మాజీ సర్పంచ్ రంజిత్ కుమార్, సర్పంచ్ పెద్దనరసింహ, చిన్నారెడ్డి, ఈదన్న యాదవ్, పరమల ప్రకాష్, వడ్డేమాన్ రామకృష్ణ, ఆనంద్ యాదవ్, బాల గౌడ్, చిన్నమారుమధు,తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ క్యాలెండర్ , డైరీలు పంపిణీ



**కోయిలకొండ సూర్య న్యూస్:** టిఆర్ఎస్ పార్టీ 2026 నూతన సంవత్సరం క్యాలెండర్ మండల కేంద్రమైన కోయిల్ కొండలో భి ఆర్ఎస్ పార్టీ నాయకులు ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కృష్ణయ్య మాట్లాడుతూ, ప్రతి నూతన సంవత్సరం టిఆర్ఎస్ పార్టీ క్యాలెండర్ను ఆవిష్కరించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. ప్రజలకు బీ ఆర్ఎస్ ప్రభుత్వం హాయంలో అందించిన సంక్షేమ పథకాలు డైరీలో క్లుప్తంగా ఉన్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, మోదీపురం రవి, రాజా వర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ,మల్లయ్య యాదవ్ ,కరుణాకర్ రెడ్డి ,రాజ్ కుమార్ ,హరి సింగ్ ,కుమ్మరి రాజు, దేవరం ,శ్రీనివాసులు ,దశరథ రెడ్డి నాగేష్ ఆంజనేయులు జమాల్పూర్ నర్సింలు, శివా గౌడ్ ,రమేష్, రాములు, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ నాయకులు నిరసన



**కోయిలకొండ సూర్య న్యూస్:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై కాంగ్రెస్ సర్కార్ రాజకీయ వేధింపులకు వ్యతిరేకంగా మండల కేంద్రమైన కోయిలకొండ వివేకానంద చౌరస్తాలో మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు కొద్దిసేపు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీ ఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కృష్ణయ్య మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి పై కక్షపూరిత రాజకీయాలు మానుకోవాలని ఆయన తెలియజేశారు.కెసిఆర్ నిరంతరం ప్రజా సంక్షేమం కోసం కృషి చేయడం జరిగిందని తెలియజేశారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మోదీపురం రవి, రాజా వర్ధన్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మల్లయ్య యాదవ్ ,కరుణాకర్ రెడ్డి, జి రాజ్ కుమార్, హరి సింగ్ ,కుమ్మరి రాజు, శ్రీనివాసులు ,దశరథ రెడ్డి ,నాగేష్ ,ఆంజనేయులు ,జమాల్పూర్ శివ గౌడు, కృష్ణయ్య గౌడ్, షాహిన్, మాధవులు, రమేష్, రవి, మోహిన్ తదితరులు పాల్గొన్నారు.

# డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న రేవంత్ రెడ్డి...!

**- తెలంగాణ తెచ్చి, పదేళ్లు అభివృద్ధి చేసిన నేతపై విచారణ...!**
**- ప్రభుత్వం సమాధానం చెప్పాలి...**
**- సర్పంచ్ వెంకట్ రాములు గౌడ్...**
**- చిన్నారేవల్లి లో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం...**



**బాలానగర్ సూర్య :** ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయన కుటుంబాన్ని టార్గెట్ చేసి అరెస్ట్ చేసేందుకు విచారణ పేరిట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర పన్నుతున్నారని బాలానగర్ మండలం చిన్నారేవల్లి సర్పంచ్ వెంకట్ రాములు గౌడ్ ఆరోపించారు. కెసిఆర్ పై సిట్ విచారణను నిరసిస్తూ ఆదివారం చిన్నారేవల్లి గ్రామం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం సర్పంచ్ వెంకట్ రాములు గౌడ్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఎన్నెన్నో హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని,! ఇప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సింది పోయి ప్రతిపక్షాలను టార్గెట్ చేసి రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ నడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా కొలువైన రేవంత్ రెడ్డి రాష్ట్రానికి ఏం చేయాలి.. ఎలాంటి పథకాలు తేవాలి.. ఎలా అభివృద్ధి చేయాలి అన్నది పక్కనపెట్టి.. ప్రతిపక్షాలను ఎలా టార్గెట్ చేయాలి.. అని ఆలోచిస్తూ కూర్చున్నారని ఎద్దేవా చేశారు. ఉద్యమం ద్వారా తెలంగాణను తీసుకువచ్చి పదేళ్లపాటు ఎన్నో సంక్షేమ కార్యక్రమాల ద్వారా తెలంగాణ అభ్యున్నతికి పాటుపడిన కేసీఆర్ ను విచారించడం ఎన్నికలకు ముందు జరుగుతున్న కుట్రని ఆయన అన్నారు. ఎన్నికల ముందే ఇలా ఎందుకు చేయాల్సి వస్తుందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కుట్రను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని అన్నారు అనంతరం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేసి ముఖ్యమంత్రి కీ వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమం లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ పై సిట్ విచారణ కక్ష సాధింపు చర్య



**లింగాల, సూర్య న్యూస్:** మాజీ ముఖ్య మంత్రి, భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ సిట్ విచారణ చేయడం రాజకీయ కక్ష సాధింపు చర్య అని మాజీ సింగిల్ విండో అధ్యక్షులు జంబూల హనుమంత్ రెడ్డి అన్నారు. మాజీ సిఎం కెసిఆర్ పై ప్రభుత్వం సీట్ విచారణ చేపట్టడాన్ని నిరసనగా అంబటిపల్లి గ్రామంలో బిఆర్ఎస్ శ్రేణులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రధాన రహదారి పై ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ పార్టీ అధినేత చంద్రశేఖర్రావుపై ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక, రాజకీయ కక్షసాధింపు చర్యలను పాల్పడుతున్నదని విమర్శించారు.ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కెసిఆర్ను వేధిస్తోందని, రాజకీయ వేధింపుల్లో భాగంగా ఆయనను అవమానిస్తూ అమానుషంగా ప్రవర్తిస్తోందని అన్నారు. టెలిఫోన్ ట్యాపింగ్ పేరిట కట్టుకథలు సృష్టించి, ఇప్పుడు సిట్ విచారణ జరపడం దుర్మార్గమైన, నీచమైన వైఖరి అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం తన ప్రాణాన్ని సైతం లెక్క చేయకుండా పోరాడి తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చిన తెలంగాణ రాష్ట్ర జాతిపిత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును ఇలా సిట్ విచారణ పేరుతో అవమానించడం తగదని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షులు రాజేష్, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, వార్డ్ మెంబర్ లు నరసింహ,శంకర్, పర్వతాలు,రాములమ్మ, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గోవిందు, శివయ్య, సౌట మాధవులు గౌడ్,మన్సూర్, బాబు,రవి,గడ్డం వెంకటయ్య, మహేష్ సాగర్,సమీద్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం దిష్టిబొమ్మ దగ్ధం



**ఊర్కొండ: సూర్య న్యూస్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సిట్ విచారణ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపిస్తూ సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆదివారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రాస్తారోకో నిర్వహిస్తుండగా పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. అనంతరం వారి సొంత పూచికతపై విడుదల చేశారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను సిట్ విచారణ పేరుతో ఇబ్బందుల గురి చేస్తుందని ప్రజాస్వామ్యానికి ఖుని చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాసులు, కృష్ణ గౌడ్ , లక్ష్మయ్య, నరేష్ తదితరులున్నారు.

## కాంగ్రెస్ తీరుపై బిఆర్ఎస్ నిరసన



**కోడేరు, సూర్యన్యూస్ :** మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సూర్య రాజశేఖర్ గౌడ్ ,గ్రామ అధ్యక్షులు శ్రీశైలం ఆధ్యర్యంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరియు కొల్లాపూర్ నియోజక వర్గ మాజీ శాసనసభ్యులు బీరం హర్ష వర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు కోడేరు అంబేద్కర్ విగ్రహం ముందు కాంగ్రెస్ కు నిరసనగా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ కు సిట్ నోటీసులు పంపడంపై బిఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ స్వప్నాన్ని సాకారం చేసిన మాజీ సీఎం కెసిఆర్ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పై వారు మండిపడ్డారు. రాజకీయ కక్షతో సీట్ నోటీసులు ఇచ్చి భయ పెట్టాలనుకోవడం తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానపరచడమేనన్నారు. ఈ కార్యక్రమంలో ఆయాగ్రామాల సర్పంచులు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



**మాగనూరు సూర్య న్యూస్ :** మాఘ పౌర్ణమి పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలోని శ్రీ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకం, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం స్వామి వారికి పల్లకి సేవ నిర్వహించి, భక్తులు మొక్కులు చెల్లించి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రమేష్ గౌడ్, కోశాధికారి కే కృష్ణయ్య, పూజారి ప్రభు, ప్రహ్లాద ,రాకేష్ గ్రామ పెద్దలు ఉజెల్లి వెంకటయ్య, తిమ్మయ్య ,పురుషోత్తం రెడ్డి, దండు బస్వరాజ్ ,చాకలి లింగప్ప ,దేవేంద్రప్ప ,మురళి జగదీష్ శెట్టి ,రాఘవేంద్ర శెట్టి, మురళీమోహన్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పెబ్బేరు ఏఎస్ఐ బొల్లె శ్రీనివాసులు పదవీ విరమణ.

**- బొల్లె శ్రీనివాసులు సేవలకు జిల్లా పోలీసుశాఖ గౌరవం**

**- శ్రీనివాసులు కు జిల్లా ఎస్పీ చేత ఘన సన్మానం.**



**పెద్దకొత్తపల్లి. సూర్య న్యూస్ :** ఖాకీ యూనిఫాం ధరించి ప్రజల రక్షణకే జీవితాన్ని అంకితం చేసిన పోలీసు అధికారులు పదవీ విరమణ పొందినా, వారి సేవల విలువ ఎప్పటికీ తరుగదని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అన్నారు.చిన్నకొత్తపల్లి గ్రామానికి చెందిన బొల్లె శ్రీనివాసులు పెబ్బేరు పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన సందర్భంగా, వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఘన సన్మాన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొని ఆయనను పూలమాలలు, శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. నిబద్ధతతో, క్రమశిక్షణతో ప్రజా శాంతి భద్రతల పరిరక్షణకు అందించిన సేవలకు జిల్లా పోలీసుశాఖ తరపున హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ సునిత రెడ్డి మాట్లాడుతూ, పోలీసు ఉద్యోగం అనేక త్యాగాలతో కూడుకున్నదని, కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజల రక్షణ, న్యాయ పరిరక్షణ కోసం సేవలందించడం గర్వకారణమని పేర్కొన్నారు. పదవీ విరమణ ఒక ముగింపు కాదని, అది కొత్త జీవనానికి ఆరంభమని అన్నారు. విశ్రాంత జీవితాన్ని ఆరోగ్యంగా, సంతోషంగా గడపాలని, కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం కేటాయిస్తూ చురుకైన జీవన విధానాన్ని కొనసాగించాలని సూచించారు. పదవీ విరమణ అనంతరం పొందే ఆర్థిక ప్రయోజనాలను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని, ఖాళీగా ఉండకుండా నచ్చిన రంగంలో ఏదో ఒక వ్యాపకాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. కష్టపడి, నిబద్ధతతో పనిచేసినప్పుడే సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తుందని అన్నారు.అనంతరం బొల్లె శ్రీనివాసులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన జీపీఎఫ్, ఇన్స్యూరెన్స్ తదితర బెనిఫిట్స్ బిల్లులను అందజేసి, మిగిలిన ప్రయోజనాలు కూడా త్వరితగతిన అందేలా చూడాలని సంబంధిత సెక్షన్ అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ, జిల్లా పోలీసు కార్యాలయం ఏఓ సునందన, కొత్తకోట సీఐ రాంబాబు, వనపర్తి సీఐ రత్నం, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, బొల్లె శ్రీనివాసులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రాజకీయ వేధింపులకు నిరసనగా పెద్దకొత్తపల్లి లో సీఎం దిష్టిబొమ్మ దగ్ధం చేసి బీఆర్ఎస్ నిరసన



**పెద్దకొత్తపల్లి. సూర్య న్యూస్:** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరిత రాజకీయ వేధింపులకు పాల్పడుతోందని ఆరోపిస్తూ ఆ వైఖరికి నిరసనగా పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా దగ్గర ఆదివారం ప్రజాగర్జనతో మార్మోగింది. కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి పిలుపు మేరకు, పెద్దకొత్తపల్లి సర్పంచ్ బెట్టరి రేణుక నాగరాజు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ ర్యాలీ, నిరసన ధర్నా నిర్వహించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అంబేద్కర్ చౌరస్తాను ఉలిక్కిపడేలా చేశారు. ప్రజా సమస్యలను పూర్తిగా పక్కనపెట్టి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాయకుడిపై అక్రమ కేసులు, వేధింపులు పెట్టడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమైందని బీఆర్ఎస్ శ్రేణులు మండిపడ్డాయి.సర్పంచ్ రేణుక బెట్టరి నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అయిన కేసీఆర్పై రాజకీయ కక్ష సాధింపులు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గుచేటు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక, ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ డ్రామాలు ఆడుతున్నారు. కేసీఆర్ను తాకితే బీఆర్ఎస్ శ్రేణులు ఊరుకునే ప్రసక్తే లేదు అని ఘాటుగా హెచ్చరించారు. మాజీ జెడ్పిటిసి సింగారం వెంకటయ్య మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆరు గ్యారెంటీలు గాలికి వదిలేసి, ప్రతిపక్షాన్ని అణిచివేయడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమని అన్నారు.సాతాపూర్ సర్పంచ్ వంశీ గౌడ్ మాట్లాడుతూ, రైతులు, పేదలు నిత్యం ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోని ప్రభుత్వం, కేసీఆర్పై రాజకీయ దాడులు చేయడం దురదృష్టకరమని అన్నారు. ప్రజలే త్వరలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.చిన్నకొత్తపల్లి సర్పంచ్ తోకల రాజేశ్వరి విష్ణువర్ధన్ యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధికి బాటలు వేసిన నాయకుడిపై అకారణ ఆరోపణలు చేయడం అన్యాయమని అన్నారు. మహిళలు, గ్రామపంచాయతీల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ముష్టిపల్లి సర్పంచ్ విష్ణు మాట్లాడుతూ, బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు అభివృద్ధి బాట పట్టాయని, ఆ అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసి రాజకీయ కక్షలకు పాల్పడుతోందని మండిపడ్డారు. కేసీఆర్పై వేధింపులు కొనసాగితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు మెడికల్ షాప్ రాజశేఖర్, కొత్తపట్ల ఎత్తం శివ, పెద్దకొత్తపల్లి వార్డు మెంబర్ సత్యనారాయణ, ప్రజలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధాంతం కోసం ఆస్తులు అమ్ముకున్న కాలం నుంచి సిద్ధాంతం పేరుతో ఆస్తులు కూడబెట్టే దశకు రాజకీయాలు.

**- ఇదే ప్రజాస్వామ్య పతనానికి కారణం. రైతు సుదర్శన్ రెడ్డి ఘాటు విమర్శ**



**పెద్దకొత్తపల్లి. సూర్య న్యూస్ :** దేశంలో ఒకప్పుడు పార్టీని సిద్ధాంతాన్ని కాపాడుకోవడం కోసం పోరాట యోధులు తమ ఆస్తులను అమ్ముకున్నారని కానీ నేడు అదే సిద్ధాంతం పేరుతో ఆస్తులు కూడగట్టుకుంటున్న నాయకులే రాజకీయాలను నడిపిస్తున్నారని సుదర్శన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాడు నాయకులు పార్టీ కోసం బతికారు నేడు నాయకులు పార్టీని వాడుకొని బతుకుతున్నారు.అనాడు సిద్ధాంతం కోసం త్యాగం జరిగింది.నేడు సిద్ధాంతమే సంపాదనకు సాధనంగా మారింది అని ఘాటు రాజకీయ పంచ్ వేశారు.మేము గొప్ప సిద్ధాంతం గల పార్టీలో పనిచేస్తున్నాం అని గొప్పగా చెప్పుకునే నాయకులే, ఆ సిద్ధాంతాన్ని లోపల నుంచి ఖాళీ చేస్తున్నారని విమర్శించారు. సిద్ధాంతం చెడిపోలేదని, సిద్ధాంతాన్ని మోసే నాయకుల నైతికతే పూర్తిగా పతనమైందని అన్నారు. ప్రజాస్వామ్యంలో పార్టీలు కనుమరుగవుతున్నాయంటే దానికి కారణం సిద్ధాంత వైఫల్యం కాదని, సిద్ధాంతం పేరుతో స్వార్థ రాజకీయాలు చేస్తున్న నాయకులే అసలు కారణమని స్పష్టం చేశారు.త్యాగం చేసే నాయకుడికి త్యాగాన్ని అమ్ముకునే నాయకుడికి మధ్య ప్రజలు తేడా గమనించారు.ఇక రాజకీయాల్లో ముసుగులు ఎక్కువకాలం నిలవవు అంటూ ప్రజల తీర్పు దగ్గర్లోనే ఉందని హెచ్చరించారు.దేశ రాజకీయాల్లో నైతిక విలువలు తిరిగి రావాలంటే, నాయకుల ప్రవర్తన మారాలని, లేదంటే గొప్ప సిద్ధాంతాల పేరుతో నడిచిన పార్టీలే చరిత్ర పుస్తకాలకే పరిమితం అవుతాయని సుదర్శన్ రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు.

## గల్లి స్థాయి నుండే ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి కి శ్రీకారం

**- 22వ వార్డులో ఇంటింటి ప్రచారం:ఎమ్మెల్యే. తూడి మేఘా రెడ్డి**





**సూర్య, వనపర్తి ప్రతినిధి :** ప్రణాళిక బద్ధంగా గల్లి స్థాయి నుండి అభివృద్ధికి శ్రీకారం చుట్టామని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి స్పష్టం చేశారు.పుర ఎన్నికల్లో భాగంగా ఆదివారం 22 వ వార్డులో కౌన్సిలర్ అభ్యర్థి కల్పన సత్యం కు మద్దతుగా మార్నింగ్ వాక్ తో గల్లి గల్లి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కల్పనా సత్యం ను చేతి గుర్తుపై ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ పాలనలో కలెక్టర్, ఎస్పీ బంగ్లా, రోడ్లపై డివైడర్లు కట్టి ..లైట్లు ఏర్పాటు చేసి, మినీ ట్యాంక్ బండ్ ల పేరుతో చెరువుకు రిటిట్ మెంట్ కట్టి అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవ చేశారు.అభివృద్ధి అంటే కాంగ్రెస్ అని 30 సంవత్సరాల సమస్యలు డ్రైనేజీ, సిసి రోడ్డు నిర్మాణం, విద్యుత్ సమస్యలు ప్రతి వార్డులలో పరిష్కరిస్తూ .. ప్రభుత్వం ఇచ్చిన హామీలు సన్న బియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, ఉచిత ప్రయాణం, ఉచిత విద్యుత్, రైతు బీమా, రైతు భరోసా, బోనస్, 500 కే సిలిండర్ వంటి పథకాలను ప్రభుత్వం ప్రజలకు అందిస్తుందని కొనియాడారు.వార్డు అభివృద్ధితో ప్రజలు సంతోషంగా ఉన్నారని..వార్డు ప్రజల నుండి మంచి స్పందన లభిస్తుందని పేర్కొన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో చేసిన అభివృదే వనపర్తి మున్సిపల్ ఎన్నికలో 33 వార్డులలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలుస్తున్నారని ధీమా వ్యక్తం చేశారు.ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చీర్ల చందర్, కిచ్చా రెడ్డి, వెంకటయ్య యాదవ్, లక్కాకుల సతీష్, బాలరాజు, ఆదిత్య, కార్యకర్తలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత..



**వెల్దండ.సూర్య న్యూస్ :** మండల పరిధిలోని పోతే పల్లి. గ్రామానికి చెందిన. వావిళ్ళ వెంకటయ్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు విషయం తెలుసుకున్న. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సంజీవ్ యాదవ్. మృతుని కుటుంబాన్ని పరామర్శించి పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు ఆయన వెంట. కాంగ్రెస్ నాయకులు. తానేష్ యాదవ్. తదితరులు ఉన్నారు.

## మండల కేంద్రంలో సీఎం దిష్టిబొమ్మ దహనం



**మిడ్జిల్ సూర్య న్యూస్:** మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు కు సిట్ బృందం ఫోన్ ట్యాంపరింగ్ కేసులో విచారణకు రావాలని నోటీసులు ఇచ్చిన తీరును నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కక్షపూరిత ధోరణితో బిఆర్ఎస్ పార్టీ నాయకులను టార్గెట్ చేస్తూ ప్రతిపక్షాలను అణిచివేయాలని చూస్తున్నారన్నారు. తెలంగాణ సాధించిన పోరాట యోధుడు, మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు అని కూడా చూడకుండా కనీస గౌరవం లేకుండా ఫోన్ ట్యాంపరింగ్ కేసులో సీట్ బృందానికి సహకరిస్తానని చెప్పిన, పట్టించుకోకుండా ఎర్రవెల్లిలోని తన ఫామ్ హౌస్ లో విచారణకు అనుకూలంగా ఉన్నా కూడా సిట్ బృందం అధికారులు నంది హిల్స్ లోని తన ఇంటికి నోటీసులు అతికించి రప్పించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి హైమావతి బాల్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శశిరేఖ బాలు, మాజీ ఎంపీపీ సుదర్శన్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాండు యాదవ్, నాయకులు గంజి కృష్ణ, శేఖర్, గోపాల్, భాస్కర్ చారి, రాఘవేందర్, వెంకటయ్య, సుకుమార్, నరసింహ, రమేష్ నాయక్, భాస్కర్ నాయక్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఫాతిహా జిక్ర్ మహాఫిల్

### -హాజరైన మౌలానా సయ్యద్ ఆలె ముస్తఫా ఖాద్రీ



**పాలమూరు సూర్య న్యూస్ :** భూత్‌పూర్ గ్రామంలో పీరుముర్షిద్ హజ్రత్ సయ్యద్ కాజిమ్ పాషా ఖాద్రీ జీలానీ (రహ్మతుల్లాహి అలైహి) ఐదవ ఫాతిహా జిక్ర్ మహాఫిల్ ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జానషీన్ ఖతీబ్-ఎ-దక్కన్, సజ్జాదా నషీన్ ఖాన్కా ముసవియ్యా హైదరాబాద్‌కు చెందిన హజ్రత్ మౌలానా సయ్యద్ ఆలె ముస్తఫా ఖాద్రీ అల్మూసవీ అల్ జిలానీ అలీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, అల్లాహ్ తాలా తన భక్తులపై డెబ్బై తల్లులకన్నా ఎక్కువ ప్రేమ చూపించే సర్వశక్తిమంతుడన్నారు. భక్తులపై పాపాలు చేసినా, తప్పులు చేసినా అల్లాహ్ తాలా వారి లోపాలను తన కరుణ చాదరంతో కప్పిపెట్టి క్షమిస్తాడని వివరించారు. తల్లి తన పిల్లల లోపాలను ప్రేమతో దాచినట్టే, అల్లాహ్ తాలా కూడా తన భక్తులపై అపారమైన కరుణ చూపిస్తాడని చెప్పారు. అల్లాహ్ తాలా మనలను ప్రవక్త ముహమ్మద్ ఉమ్మత్‌గా చేసిన గొప్ప ఉపకారాన్ని గుర్తు చేస్తూ, ఆయనను "రహ్మతుల్ లిల్‌ఆలమిన్"గా సృష్టించాడని తెలిపారు. మనం చేసిన పాపాలకు ప్రవక్త ముహమ్మద్ వాసితా ద్వారా అల్లాహ్ తాలా వద్ద క్షమాపణ కోరాలని హితవు పలికారు. ప్రతి ముస్లిం ఐదు వేళల నమాజ్‌ను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఖుర్‌ఆన్ పఠనంతో ప్రారంభమై, బారగాహ్-ఎ-రిసాలత్ సల్లల్లాహు అలైహి వసల్లం స్తుతిలో నాత్-ఎ-రసూల్ వినిపించబడింది.మహాఫిల్‌ను బజ్మ్ అంజుమన్ ఖాదరియా కాజిమియా మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు జహంగీర్ పాషా ఖాద్రీ అల్ కాజిమీ పర్యవేక్షించగాబాబా షరఫ్‌ఉద్దీన్ సాహెబ్, మస్జిద్ కమిటీ అధ్యక్షుడు, మహమ్మద్ అహ్మద్ (ముత్తవల్లి జామియా మస్జిద్), మహమ్మద్ ఖాసిం ఖురేషీ, షేక్ యాసిన్, మహమ్మద్ జహంగీర్, మహమ్మద్ నయీమ్, సయ్యద్ అబ్దుల్ ఖుద్దూస్ ఖాద్రీ అల్ కాజిమీ, మహమ్మద్ రహీమ్ పాషా ఖాద్రీ అల్ కాజిమీ, మహమ్మద్ ఇబ్రాహీం ఖాద్రీ అల్ కాజిమీ, మహమ్మద్ షబీర్ ఖాద్రీ అల్ కాజ్మి, మహమ్మద్ అఖ్తర్ ఖాద్రి అల్ కాజ్మి, మహమ్మద్ అసద్ ఖాద్రీ అల్ కాజ్మి, మహమ్మద్ అలీం ఖాద్రీ అల్ కాజ్మి, రహ్మత్ పాషా ఖాద్రీ అల్ కాజ్మి, అబ్దుల్ తాహిర్ ఖాద్రీ అల్ కాజ్మి , మహమ్మద్ జమీర్ ఖాద్రీ అల్ కాజ్మి, మహమ్మద్ ఖాన్ ఖాద్రీ అల్ కాజ్మి, మహమ్మద్ యూనస్ ఖాద్రి అల్ కాజ్మీ, ప్రతనిధులు, భక్తులు పాల్గొన్నారు.

## కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు



**గోపాల్పేట సూర్య :** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం లో విక్టరీ ఫోటో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు మాస్టర్ సురేందర్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు బెల్టులు లలిత పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ రుక్మేందర్ చేతుల మీదుగా బెల్టులు ప్రధానం చేశారు ఈ కార్యక్రమంలో మాస్టర్ నిఖిల్ యాదవ్ ఇన్స్టక్టర్స్ జస్వంత్ వాసుదేవ్ పవన్ యాదవ్ డి రాజు చంద్రశేఖర్ తదితరులున్నారు.

## విద్య కోసం మొత్తం బడ్జెట్లో 10% కేటాయించాలి

**మహబూబ్ నగర్ సూర్య న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం ఆదివారం ప్రవేశపెట్టిన మొత్తం బడ్జెట్లో కేవలం విద్య కోసం 2.6% కేటాయించడం దేశంలోని బడుగు ,బలహీన వర్గాల విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్నట్టే అని మండిపడ్డారు. విద్యపై ప్రపంచ సగటు 4.48 శాతం ఉంటే కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో కేవలం 2.6% విద్యకు కేటాయించడం సిగ్గుచేటు అన్నారు.దీన్ని బట్టి దేశంలో విద్యను వ్యాపారంగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పడుతుందన్నారు.నేటికీ దేశంలో లక్షల మంది పేద విద్యార్థులు చదువుకు దూరం అయ్యి లేదా మధ్యలోనే మానేసి పాఠశాల బయటే ఉండిపోతున్నారు. విద్య కోసం అధిక ఖర్చు చేసే అమెరికా, బ్రిటన్, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాలు నాణ్యమైన విద్య, పరిశోధనలకు ప్రాధాన్యత ఇస్తుండగా మనదేశంలో మాత్రం విద్య కోసం బడ్జెట్ కేటాయించకుండా విద్యను వ్యాపారంగా మార్చడానికి ప్రయత్నం చేస్తుందన్నారు.

## మాకు కూడా బి ఫామ్ ఇవ్వండి



**మహబూబ్ నగర్ సూర్య న్యూస్ :** మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో గిరిజన విద్యార్థి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ,న్యాయ పరిశోధక విద్యార్థి రవి రాథోడ్ మహబూబ్నగర్ ఎం ఎల్ ఎ యెన్నం శ్రీనివాస్ రెడ్డి ని కలిసి 01,44,48 డివిజన్లలో జనరల్ సీట్లలో ఆదివాసి గిరిజన లంబాడ/బంజారా అభ్యర్థులకు కాంగ్రెస్ పార్టీ బి ఫామ్ టికెట్లు కేటాయించాలని ఆదివారం వినతి పత్రం అందజేశారు. మహబూబ్నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో జనరల్ వార్డు ఒకటవ డివిజన్ నుండి కరంతోట్ దేవ్లీ మేగ్యా నాయక్ కు ,44 వ డివిజన్ నుండి పాత్లవత్ తిరుపతి నాయక్ కు 48 వ డివిజన్ నుండి విస్లావత్ కిషన్ నాయక్ కు ఆదివాసి గిరిజన లంబాడీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు కాంగ్రెస్ పార్టీ తరపున బి ఫామ్ టిక్కెట్లు కేటాయించాలని కోరారు.ఈ కార్యక్రమంలో 1 వ డివిజన్ అభ్యర్థి కరంతోట్ దేవ్లీ మేగ్యా నాయక్, 44 వ డివిజన్ అభ్యర్థి పాత్లవత్ తిరుపతి నాయక్, జీవీఎస్ఎస్ నాయకుడు జే.రామచంద్రనాయక్, గిరిజన నాయకులు వెంకట్ నాయక్, నర్సింగ్, గ్రా.రాజు, విజయ్, టోప్యా, పాండు,అశోక్, గ్రా.రాజు, ఉద్య, నరసింహ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుల నిరసన



**నవాబుపేట్ సూర్య న్యూస్:** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కు టెలిఫోన్ ట్యాంపరింగ్ పేరిట సీట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ మండలంలోని లింగంపల్లి,యన్మన్ గండ్ల,కాకర్లపహాడ్ గ్రామాలలోని బీఆర్ఎస్ నాయకులు ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు.నాయకులు రోడ్లపైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్,లింగంపల్లి సర్పంచ్ యాదగిరి,కాకర్ల పహాడ్ సర్పంచ్ బాలయ్య,యన్మన్ గండ్ల ఉప సర్పంచ్ హన్మంతు నాయక్,రఘు,తిరుపతయ్య,మక్సుద్ తదితరులు పాల్గొన్నారు.



**వెల్దండ సూర్య న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి బి.ఆర్.ఎస్. అధినేత కెసిఆర్ పై. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా. అక్రమ కేసులు పెడుతున్నారని నిరసిస్తూ ఆదివారం మండల కేంద్రంలో బి.ఆర్.ఎస్ .మండల శాఖ ఆధ్వర్యంలో శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారిపై నల్ల బ్యాడ్జీలను కండువాలను ధరించి నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. కెసిఆర్ ను సీట్ పేరుతో వేధింపులకు గురి చేయడం సరికాదని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని రాబోయే రోజులలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని వారన్నారు ఈ కార్యక్రమంలో. సింగిల్ విండో చైర్మన్. భాస్కరరావు. బి ఆర్ఎస్ నాయకులు. పుట్ట .రాంరెడ్డి. వెంకటయ్య గౌడ్. జోగయ్య. యాదగిరి. హైజాక్. లింగం. శ్రీను. ఆనంద్. ప్రవీణ్. ప్రసాద్. శ్రీను. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక విద్యకు దూరంగా బడ్జెట్ కేటాయింపులు - టిఎస్ యుటిఎఫ్

**పాలమూరు సూర్య న్యూస్ :** కేంద్ర బడ్జెట్ లో విద్యారంగానికి కేటాయింపులు సార్వత్రిక విద్యా సాధన లక్ష్యానికి దూరంగా ఉన్నాయని టిఎస్ యుటిఎఫ్ మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె రవికుమార్, ఎన్ వెంకటేష్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. గతేడాది 28,650 కోట్లు కెటాయించగా,ఏ ఏటా బడ్జెట్ లో 1,39,289 కోట్లు కేటాయించినా మొత్తం బడ్జెట్ దామాషాలో తక్కువగానే ఉంటుందని పేర్కొన్నారు. పెరిగిన ధరలతో పోలిస్తే మధ్యాహ్నం భోజనం, సమగ్ర శిక్ష కు కెటాయించిన బడ్జెట్ ఏమాత్రం సరిపోదని, జాతీయ విద్యా కమీషన్ సిఫారసు ప్రకారం బడ్జెట్లో 10 శాతం,జిడిపిలో 6శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు.కేంద్ర బడ్జెట్ లో ఆశించినంత ఉద్యోగులకు ఊరట లభించలేదని, చట్టం ప్రకారమే ఆదాయపు పన్ను స్లాబులు ఉంటాయని ప్రకటించటం అన్యాయమన్నారు.

## ఎవరికి వారే యమునా తీరే..! ఆత్మకూరు మున్సిపాలిటీలో రాజకీయ పరిస్థితి. మున్సిపాలిటీలో పది వార్డులు




**సూర్య న్యూస్/ ఆత్మకూరు:** ఆత్మకూరు మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ల దాఖలను బట్టి చూస్తే రాజకీయ పార్టీలపరంగా ఎవరికి వారే యమునా తీరే గా నడిచినట్లు కనిపిస్తున్నది. మునిసిపాటిలో పది వార్డులు కలవు. మొత్తం ఓటర్లు 11,579. వీరిలు పురుషులు 5599 స్త్రీలు 5981 కలరు. ఎన్నికల నామినేషన్ల స్వీకరణ 28 నుంచి 30వ తేదీ వరకు కొనసాగింది. 1 వ వార్డు (ఖానాపురం) ఈ స్థానం జనరల్ కేటగిరికి రావడం జరిగింది. ఈ వార్డులో మొత్తం 8 గురు నామినేషన్ వేయడం జరిగింది. ఎస్ రవీందర్ (కాంగ్రెస్), కోట్ల తిరుపతి(కాంగ్రెస్) శివ శంకర్ గౌడ్(బిజెపి), జి నవీన్ రెడ్డి (కాంగ్రెస్ ) కిష్టారెడ్డి (టిఆర్ఎస్ )జి వెంకటేశ్వర్లు (టిఆర్ఎస్ )బి చెన్నయ్య (టిఆర్ఎస్)ఏ మొగిలిన్న (టిఆర్ఎస్) నామినేషన్ వేశారు. వీరిలో ఒకరికి మాత్రమే పార్టీ బీఫామ్ ఇవ్వనుంది. రెండవ వార్డ్ ఈ వార్డు ఎస్టీ జనరల్ కు రావడం జరిగింది . ఈ వార్డులో ఐదుగురు నామినేషన్ వేయడం జరిగింది ఎం శ్రీనివాసులు (కాంగ్రెస్) ఎం జయరాం నాయక్ (టిఆర్ఎస్) తులసి (ఇండిపెండెంట్) రవి (బిజెపి)ఎరుకలి రాములు (బిజెపి) నుండి నామినేషన్ వేయడం జరిగింది. మూడవ వార్డు ఈ వార్డు జనరల్ ఉమెన్ రిజర్వ్ కావడం జరిగింది. ఈ వాడుకు నలుగురు నామినేషన్ దాఖలు చేశారు.రాజేశ్వరి (కాంగ్రెస్)ఈ లలిత (బిజెపి)అంజమ్మ (కాంగ్రెస్) శ్రీలత (కాంగ్రెస్). నాలుగో వార్డ్ ఈ వార్డు జనరల్ వుమెన్ కు రిజర్వ్ కావడం జరిగింది. దీనిలో పుల్లరి మంజుల (కాంగ్రెస్)ఏ శంకరమ్మ (టిఆర్ఎస్ )బి అంజలి దేవి (జిఎస్పి)గంగ (కాంగ్రెస్ )టీజే ఉమాదేవి (బిజెపి) ఎరుముల లక్ష్మి (బిజెపి) చెట్ల రాజేశ్వరి (బిజెపి) చెట్ల రాజేశ్వరి (కాంగ్రెస్). ఐదవ వార్డు ఈ వార్డ్ ఎస్సీ జనరల్ రావడం జరిగింది. ఈ వార్డుకు పదిమంది నామినేషన్ వేయడం జరిగింది. టి జానకి రాములు(టిఆర్ఎస్) వినోద్ కుమార్(స్వతంత్రం) దండు శ్రీనివాసులు(కాంగ్రెస్) సేపూరి వెంకట నారాయణ (టిఆర్ఎస్)బోరెల్లి రాములు (టిఆర్ఎస్ )మహేష్ (స్వతంత్రం) రవి ప్రకాష్ (స్వతంత్రం)బోరెల్లి శ్రీను (కాంగ్రెస్) కావలి కృష్ణ (కాంగ్రెస్) కాల్వకింది కృష్ణ (కుమార్,(స్వతంత్రం) ఆరవ వార్డు ఈ వార్డు బీసీ జనరల్ కావడం జరిగింది. ఈ వార్డులో ఆరుగురు నామినేషన్ వేయడం జరిగింది. పి భరత్ (బిజెపి) జి శ్రీనివాసులు (టిఆర్ఎస్ )కంచ చైతన్య (టిఆర్ఎస్ )మొట్లపల్లి రాజు (కాంగ్రెస్ )రమేష్ (కాంగ్రెస్ )శోభ(కాంగ్రెస్). ఏడవ వార్డు ఈ వార్డు బీసీ జనరల్ రిజర్వు కావడం జరిగింది. మొత్తం ఏడుగురు పోటీలో ఉన్నారు. కమ్మరి సహదేవుడు (స్వతంత్రం)నాగేశ్వర్ (కాంగ్రెస్ )కే నరసింహ (బిజెపి) అమ్మపురం శారద (కాంగ్రెస్ )జి నాగమణి (కాంగ్రెస్) కే మహేష్ కుమార్ (కాంగ్రెస్) ఎండి రియాజ్ అలీ (టిఆర్ఎస్). ఎనిమిదవ వార్డు ఈ వార్డు జనరల్ వుమెన్ కావడం జరిగింది. ఈ బార్డర్లో 9 మంది నామినేషన్ వేశారు. డి లక్ష్మి (కాంగ్రెస్ ) జిందే జ్యోతి(బిజెపి)గాయత్రి సోమిశెట్టి (కాంగ్రెస్)కె స్రవంతి (టిఆర్ఎస్ ) కే సబితా రాణి (స్వతంత్రం) బి అరుణాదేవి (కాంగ్రెస్) పి హిమబిందు (బిజెపి)రజిత (కాంగ్రెస్) 9వ వార్డు ఈ వార్డు జనరల్ వుమెన్ రిజర్వ్ కావడం జరిగింది. ఈ వాడుకు నలుగురు నామినేషన్ వేయడం జరిగింది. సద్దల తులసి (కాంగ్రెస్) శివాని (టిఆర్ఎస్ )హేమలత (టిఆర్ఎస్ )జి సబితా దిలీకర్ (కాంగ్రెస్). 10 వ వార్డు ఈ వార్డు బీసీ ఉమెన్ రిజర్వుడు కావడం జరిగింది. దీనిలో పదిమంది నామినేషన్ వేయడం జరిగింది. గొల్ల శైలజ (టిఆర్ఎస్) జుబేదాబేగం (కాంగ్రెస్) గడించు సువర్ణ (బిజెపి) రహమత్ బేగం (కాంగ్రెస్) సాహిర భాను (ఏఐఎంఐఎం) అమ్మపురం శారద (కాంగ్రెస్)ఎం జ్యోతి (స్వతంత్రం)సులోచనమ్మ (కాంగ్రెస్ )హసీనా బేగం (కాంగ్రెస్) గొల్ల శాంతి (కాంగ్రెస్). నామినేషన్ వేసిన వారిలో ఎక్కువగా కాంగ్రెస్ వారు అధికార పార్టీ వారు ఉన్నారు. రెండవ స్థానంలో ఎక్కువ పోటీలో ఉన్నవారు బిజెపిలో ఉన్నారు ఫిబ్రవరి 3న ఉపసవరణ జరగనుంది. నామినేషన్ల పరిస్థితి చూసినట్లయితే ఎవరికి వారిగే నామినేషన్ వేసినట్లు, పార్టీ సిద్ధాంతాలు అన్ని పక్కన పెట్టి, వ్యక్తిగతా నికి ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపిస్తున్నది.

## మాజీ సీఎం కేసీఆర్ కు సిట్ నోటీసుల పట్ల పియు లో ఆందోళన



**మహబూబ్ నగర్ పియు సూర్య న్యూస్ :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కు నోటీసులు విచారణకు పిలిచినందుకు నిరసనగా బి ఆర్ ఎస్ వి పాలమూరు యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు.ఈ సందర్భంగా పాలమూరు యూనివర్సిటీ బి ఆర్ ఎస్ వి అధ్యక్షుడు గడ్డం భరత్ బాబు మాట్లాడుతూ,రాజకీయ దురుద్దేశంతో పెట్టిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణకు అక్రమ పద్ధతిలో కేసీఆర్ కు నోటీసులిచ్చి ఆయన్ని సాక్షిగా విచారించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుబట్టి మరీ ఉవ్విళ్లూరుతున్నారని, ఫోన్ టాపింగ్ పేరుతో కెసిఆర్ పై రేవంత్ రెడ్డి పైశాచిక ఆనందం పొందడం దుర్మార్గమైన చర్యని అన్నారు. చట్ట పరిధిలోని అంశాలను పాటించకుండా దురుద్దేశంతో ఇచ్చే నోటీసులకు కేసీఆర్ హాజరుకావాల్సిన అవసరం లేదని,నోటీసులు ఇచ్చే అధికారం కూడా సిట్ అధికారులకు లేదని చెప్పారు.అక్రమ పద్ధతిలో, చట్టాలను అతిక్రమించి ఇచ్చిన నోటీసులతో తనకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయడమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ పీజీ కాలేజ్ బిఆర్ఎస్ వి అధ్యక్షుడు పవన్, ఆంజనేయులు, రాజేష్, పవన్, ముకేష్, మహేష్, అశోక్, చిన్న పాల్గొన్నారు.

## శ్రీశైలానికి పాదయాత్రతో బయలుదేరిన శివ స్వాములు..





**కోస్గి సూర్య న్యూస్:** శివదీక్ష మండల పూజలతో మల్లికార్జునుని సేవలో తరించిన శివస్వాములు పాదయాత్రతో శ్రీశైలానికి తరలి వెళ్లారు. ఆదివారం కోస్గి పట్టణంలోని మూడు ఆశ్రమాలకు చెందిన సుమారు వందమంది శివ స్వాములు ఇరుముడి తలపై ధరించి కాలినడకన శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు. గురుస్వాములు నీలి చంద్రశేఖర్, బీడీల శ్రీకాంత్, లక్ష్మణ్,బర్రె వెంకట్ స్వాముల ఆధ్వర్యంలో స్వాములు కాలినడకన తరలివెళ్లారు.ఏటా మాలలు ధరించి స్వామి పూజలు నిర్వహించి పాదయాత్ర చేయడం తో కోరిన కోర్కెలు తీరుతాయని నమ్మకంతో నిత్యం పూజలు చేసి స్వామివారి సన్నిధికి చేరుకొని ఇరుముడి ని శ్రీశైలం మల్లికార్జున స్వామి కి సమర్పిస్తారు.ప్రతిరోజు 40 కిలోమీటర్ల చొప్పున పాదయాత్ర చేసే స్వాములు 8రోజులపాటు నడకతో శ్రీశైలానికి చేరుకుంటారు.గురుస్వామి నీలి చంద్రశేఖర్ గత 27 ఏళ్లుగా పాదయాత్ర చేయడం విశేషం.

## మాజీ సీఎం కేసీఆర్ కు సీట్ నోటీసులు ఇవ్వడంతో బిఆర్ఎస్ నాయకుల నిరసన



**మదనాపురం సూర్య న్యూస్:** తెలంగాణ తొలి మాజీ సీఎం కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడం పట్ల బి ఆర్ ఎస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. మదనాపురం మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. మదనాపురం మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలను ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ కక్ష పూరిత ధోరణికి నిదర్శనం తెలంగాణ తొలి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ మండల మాజీ జడ్పీటీసీ సభ్యులు కృష్ణయ్య యాదవ్ మండల పార్టీ అధ్యక్షులు యాదగిరి మదనాపురం మండల కేంద్రం గ్రామ పార్టీ అధ్యక్షులు ఆవుల బాలకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమం లో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మాజీ కో-ఆప్షన్ సభ్యులు చాంద్ పాషా యూత్ అధ్యక్షులు రాజ్ కుమార్ సీనియర్ నాయకులు జనిగా కరుణాకర్ యాదవ్ మాజీ మార్కెట్ డైరెక్టర్లు వెంకటేష్ యాదవ్ సత్యం యాదవ్ నాగరాజు సీనియర్ నాయకులు మద్దెల శ్రీనివాసులు మండల అన్ని గ్రామాల సర్పంచులు మాజీ సర్పంచ్లు కురుమూర్తి శివ శంకర్ రమేష్ మరియు పార్టీ ముఖ్య నాయకులు అచ్యుతా రెడ్డి ప్రవీణ్ రెడ్డి పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉంటా.. సేవకుడిలా పనిచేస్తా



**సూర్య, వనపర్తి ప్రతినిధి:** కాలనీ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ..సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానని 13వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి.బొడ్డుపల్లి పరుశు రాం స్పష్టం చేశారు.వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 13వార్డులో కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి.బొడ్డుపల్లి పరుశురాం ప్రచార హోరు ఉధృతంగా కొనసాగుతుంది.కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి. బొడ్డుపల్లి పరుశురాం, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, అభిమానులతో కలిసి వార్డులో గడప గడపకు వెళ్లి ప్రచారం నిర్వహించారు.ప్రతి ఇంటిని సందర్శిస్తూ...కాలనీ ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.కాలనీలోని ఓటర్లను నేరుగా కలిసి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు.తనకు అవకాశం ఇస్తే ఎల్లవేళలా కాలనీ ప్రజలకు అందుబాటులో ఉంటూ పని చేస్తానని హామీ ఇచ్చారు.వారి వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికం అలవర్చుకోవాలి



**మాగనూర్ సూర్య న్యూస్ :** ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవడం వల్ల మానసిక ప్రశాంతత, ఒత్తిడి నుండి విముక్తి, సానుకూల దృక్పథం పెంపొందుతాయని శివ భక్తుడు నర్సింహ రెడ్డి అన్నారు. పవిత్రమైన మహాశివరాత్రి పురస్కరించుకొని మండలంలోని అడివి సత్యరం గ్రామ పంచాయతీ అమ్లెట్ పెగడబండ గ్రామానికి చెందిన నర్సింహ రెడ్డి తన సొంత ఖర్చులతో గ్రామస్తులకు సుమారుగా 150 మందికి పైగా శివయ్య భక్తులను శ్రీశైలం యాత్రకు తీసుకెళ్ళారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవచింతన, ధ్యానం, భక్తి మార్గాల ద్వారా అంతర్గత కోణాన్ని అర్థం చేసుకుని, ఉన్నతమైన జీవన ప్రమాణాలను సాధించవచ్చున్నారు. కావున ప్రతి ఒక్కరూ భక్తి బావని కలిగి ఉండాలన్నారు.

# సాయి రచనలు శాంతి మార్గానికి సోపానాలు

- సాహిత్య సేవలో మహిళా సాహిత్య సంస్కృతిక సంస్థ కృషి అభినందనీయం
- సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవ సంకలనం కవిత ఆవిష్కరణలో
- ఓయూ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు మసన చెన్నప్ప
- ఆకట్టుకున్న కవి సమ్మేళనం



**పాలమూరు సూర్య న్యూస్:** భగవాన్ శ్రీ సత్య సాయి బాబా రచనలు శాంతియూత సమాజ నిర్మాణానికి సోపానాలు అని ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు మసన చెన్నప్ప అభిప్రాయపడ్డారు. సత్య సాయిబాబా రచనలు భగవద్గీతతో సమానమైన ఆధ్యాత్మికత మార్గాన్ని అందించారని కొనియాడారు. శ్రీకృష్ణునికి ప్రతిరూపం సత్య సాయి బాబా అని వివరించారు. తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ భవనంలో ఏర్పాటుచేసిన భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవ సంకలనం ఆవిష్కరణ మహోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. భగవద్గీత ప్రతి ఒక్కరూ చదవాలని సూచించారు. పరమాత్ముడు శ్రీ కృష్ణుని మార్గంలో నడిపించేలా సంకలనంలోని ప్రతి కవితలు బాగున్నాయని సూచనప్రాయంగా ఆయా కవితలు చదివి వినిపించారు.పాలమూరు జిల్లాకు గుర్తింపు వచ్చేలా సంకలనం ఉందన్నారు. సాహిత్య సేవలో తెలంగాణ మహిళా సాహిత్య సంస్కృతిక సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన కవి సమ్మేళనంలో పలువురు కవులు చేసిన కవితా గానం ఆహుతులను ఆకట్టుకుంది. సాయిబాబా ఆధునిక యుగాన్ని ఆధ్యాత్మిక ప్రబోధాలతో చైతన్యపరిచిన మహానుభావులని ప్రముఖ న్యాయవాది మనోహర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్ష కార్యదర్శులు రావూరి వనజ, జి.శాంతా రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పరమార్థకవి వెల్దండ సత్యనారాయణ రావు, రావూరి సూర్యనారాయణ, రామచంద్రారెడ్డి,అవధాని చుక్కయపల్లి శ్రీదేవి, కవులు మేకల అనురాధ సక్కుబాయి ఈశ్వరమ్మ మహేశ్వరి డాక్టర్ కృష్ణవేణి సుంకరి బసవ రాజప్ప, జమున గడ్డం వనజ జ్యోసి పద్మావతి శీతాలక్ష్మి సత్యమూర్తి జన్మోజు శ్రీనివాస చారి బాలస్వామి బంధప్ప మహిళా కవులు, రచయితలు పాల్గొన్నారు.

## మునిసిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ అన్నిస్థానాలు గెలవాలి -ఎంపీ డీకే అరుణ



**మహబూబ్ నగర్ సూర్య న్యూస్ :** ఆదివారం మహబూబ్ నగర్ లోని ఎంపీ డీకే అరుణ నివాసంలో మహబూబ్ నగర్ పార్లమెంట్ పరిధిలోని 14 మున్సిపాలిటీలు, ఒక కార్పొరేషన్ ఎన్నికలకు బీజేపీ రాష్ట్ర కమిటీ నియమించిన ఇంచార్జులతో ఎంపీ డీకే అరుణ కీలక సమావేశం నిర్వహించారు. సమావేశానికి మహబూబ్ నగర్ పార్లమెంట్ పరిధి మున్సిపాలిటీ ఎన్నికల ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరైయ్యారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సుదీర్ఘంగా ఎన్నికల వ్యూహాల పై చర్చించారు. మున్సిపాలిటీల వారిగా బలాబలాలు, గెలుపు వ్యూహాలు, ప్రచార శైలి వంటి అంశాల పై చర్చించారు. బీజేపీ జాతీయ అధ్యక్షులు ఈ నెల 4 న నితిన్ నబీన్ హాజరుకానున్న కార్యకర్తల సమావేశ ఏర్పాట్ల పై చర్చించారు.

## యూరియా బుకింగ్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి.ఏవో శిరీష



**పెద్దకొత్తపల్లి. సూర్య న్యూస్:** నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు జిల్లాలో యూరియా బుకింగ్ యాప్‌ను ప్రారంభించామని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెద్దకొత్తపల్లి మండల ఏవో శిరీష కోరారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇకపై రైతులు జిల్లాలో ఎక్కడైనా అందుబాటులో ఉన్న యూరియా స్టాక్‌ను యాప్ ద్వారా బుక్ చేసుకుని యూరియా బస్తాలు పొందవచ్చని తెలిపారు. యూరియా బుకింగ్ ప్రక్రియను రైతులకు సులభంగా అర్థమయ్యేలా వివరాలు అందించామని, మండలంలోని యూరియా కేంద్రాల్లో ఏఈఓలను వాలంటీర్లుగా నియమించి రైతులకు మార్గనిర్దేశం చేస్తున్నామని చెప్పారు. అయితే యూరియా బుకింగ్ చేసుకోవాల్సిన బాధ్యత మాత్రం రైతుదేనని స్పష్టం చేశారు.ఆండ్రాయిడ్ ఫోన్ లేని రైతులు తమకు తెలిసిన వారి ఫోన్ ద్వారా యూరియా బుక్ చేసుకోవచ్చని సూచించారు. అలాగే పాస్‌బుక్‌కు ఫోన్ నెంబర్ లింక్ కాకపోయిన రైతులు సంబంధిత ఏఈఓను సంప్రదించి ప్రస్తుత ఫోన్ నెంబర్ ఇవ్వడం ద్వారా ఓటీపీ సహాయంతో అరగంటలో అప్డేట్ అవుతుందని తెలిపారు.యూరియా బుకింగ్ యాప్ వినియోగంపై డీలర్లకు కూడా అవగాహన కల్పించామని, అవసరమైన సమయంలో వారు రైతులకు సహకరిస్తారని తెలిపారు. చదువు రాని రైతులు ఇతరుల సహాయంతో యాప్‌లో యూరియా బుక్ చేసుకోవచ్చన్నారు.ప్రస్తుతం కొన్ని చోట్ల యాప్‌లో స్టాక్ సున్నాగా చూపిస్తున్నందున, రైతులు డీలర్లతో సంప్రదింపులో ఉండి స్టాక్ వచ్చిన వెంటనే యూరియా బుక్ చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు ఒక్క రైతుకు గరిష్టంగా నాలుగు బస్తాలు ఇచ్చామని, అయితే యాప్‌లో నమోదైన పొలం విస్తీర్ణాన్ని బట్టి యూరియా బస్తాల సంఖ్య మారుతుందని వివరించారు.యూరియా బుక్ చేసుకున్న రైతులు అదే రోజు లేదా మరుసటి రోజు సాయంత్రం లోపు సంబంధిత షాప్‌లో యూరియా తీసుకోవాలని, అనివార్య కారణాల వల్ల తీసుకోలేకపోతే 48 గంటల తర్వాత మాత్రమే మళ్లీ బుక్ చేసుకునే అవకాశం ఉంటుందని ఏవో శిరీష తెలిపారు. పంట ఎంట్రీ ప్రకారం యూరియా కేటాయింపు జరుగుతుందని, మొక్కజొన్న పంటకు ఎకరానికి నాలుగు బస్తాలు, వరి పంటకు ఎకరానికి రెండు బస్తాలు విడతల వారీగా అందుతాయని పేర్కొన్నారు.

## మహా పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎం ఎల్ ఏ



**అడ్డాకుల, సూర్య న్యూస్ :** అడ్డాకుల మండల కేంద్రంలోని వెంకటేష్ నివాసంలో ఆదివారం నిర్వహించిన శివ స్వాముల మహా పడిపూజ కార్యక్రమంలో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ మాలదారులు, భక్తులు రుద్రాభిషేకం, అర్చనలు, భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

సంచలన దినపత్రికగా పేరొందిన నేటి దినపత్రిక సూర్య లో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన విద్యావంతులకు, విలేకరులకు

మహబూబ్‌నగర్ జిల్లా : హన్వాడ, భూత్పూర్, కౌకుంట్ల, రాజాపూర్, మూసాపేట, దేవరకద్ర రూరల్
వనపర్తి జిల్లా : వనపర్తి రూరల్, పాన్‌గల్, ఖిల్లఘణపురం
నాగర్‌కర్నూల్ జిల్లా : అచ్చంపేట టౌన్, అచ్చంపేట రూరల్, బల్మూర్, మన్ననూర్, కొల్లాపూర్, పెంట్లవెల్లి, తాడూరు, తిమ్మాజిపేట,
జోగులాంబగద్వాల జిల్లా : ఎర్రవల్లి, వడ్డేపల్లి, మానోపాడు

ఏరియాల్లో అవకాశం కల్పిస్తోంది.
సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.

ఆసక్తి కలిగిన వారు సంప్రదించాల్సిన నెంబరు
8008622757